వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
VOICE OF PRAJALU
TGTEL/25/A2649
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మనసేత్రం
Follow
పేజీలు 10
శనివారం, మార్చి 14, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై అమెరికా గురి.. ఆచూకీ చెబితే 92 కోట్లు



ఇరాన్‌తో యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసిన అమెరికా, ఇప్పుడు ఆ దేశ అగ్ర నాయకత్వాన్ని నేరుగా లక్ష్యంగా చేసుకుంది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీతో పాటు పలువురు ఉన్నతాధికారుల ఆచూకీ తెలిపిన వారికి 10 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 92.47 కోట్లు) రివార్డు ఇస్తామని సంచలన ప్రకటన చేసింది. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ 'రివార్డ్స్ ఫర్ జస్టిస్' కార్యక్రమం కింద ఈ ప్రకటనను విడుదల చేసింది. మోజ్తబా ఖమేనీతో పాటు రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన కీలక సైనికాధికారులు అలీ అస్ఘర్ హెజాజీ, సెక్యూరిటీ చీఫ్ అలీ లారీజానీ పేర్లను కూడా ఈ జాబితాలో చేర్చింది. కొందరి ఫోటోలు అందుబాటులో లేకపోవడంతో వారి షాడో చిత్రాలను ప్రచురించింది.



## సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

## హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు: దేవ్‌జీ



## మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు..

### పేదలను దెబ్బతీస్తే మాత్రం పోరాటమే: రాంచందర్‌రావు



# మూసీ పునరుజ్జీవమే లక్ష్యం






### మూసీ ప్రాజెక్టుపై అపోహలు వ్యాప్తి చేస్తున్నారని సీఎం ఆవేదన

- నిరాశ్రయులకు అదే నియోజకవర్గాల్లో ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ
- సలహాలు స్వీకరిస్తాం కానీ పథకాన్ని ఆపమంటే వినబోమన్న స్పష్టీకరణ
- నది పునరుద్ధరణతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశ అన్న వ్యాఖ్య
- రాజకీయ స్వార్థంతో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- మూసీ చుట్టూ నాగరికత అభివృద్ధి చెందిన చరిత్రను గుర్తుచేసిన సీఎం
- పర్యావరణ పరిరక్షణ భవిష్యత్ తరాల బాధ్యత అన్న సందేశం
- ప్రాజెక్టుతో ఉపాధి, పర్యాటక రంగాలకు ఊతమిస్తామని విశ్వాసం

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఈ పథకం అమలులో ఏవైనా లోపాలు ఉంటే సూచనలు, సలహాలు స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కానీ పథకాన్ని పూర్తిగా ఆపమని చెప్పే వాదనలను మాత్రం అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం పేదలకు శత్రువు కాదని, వారిని నిరాశ్రయులను చేసే ఉద్దేశం తమకు లేదని తెలిపారు. మూసీ పునరుజ్జీవం కారణంగా ఇళ్లు కోల్పోయే వారికి ఆయా నియోజకవర్గాల్లో

(మిగతా 2వ పేజీలో)

## 'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల చేసిన సీఎం చంద్రబాబు



రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు నిధులను విడుదల చేశారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతుల అభివృద్ధి, సాగునీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ దిశగా అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాను కూడా రైతు బిడ్డనేనని, రైతుల కష్టాలు తనకు బాగా తెలుసని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఏటా రూ.20,000 అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6,000కు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000 భరిస్తోందని వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. గత 20 నెలలుగా అనేక సమస్యలను అధిగమిస్తూ రాష్ట్రాన్ని పునర్నిర్మాణ పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో జలవనరుల యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి సారించామని సీఎం పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదితో అనుసంధానం చేసి సాగునీటి సమస్యలను అధిగమించామన్నారు. చెరువుల్లో పూడిక తీసి నీటితో నింపడం వల్ల ఖరీఫ్, రబీ పంటల తర్వాత కూడా జలకళ ఉందన్నారు. దీని ఫలితంగా భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని వివరించారు. కాలువల్లో పూడికతీత, డ్రెయిన్ల ఆధునికీకరణకు ఆదేశాలు జారీ చేశామని, చివరి ఆయకట్టు భూములకు కూడా నీరు అందించే బాధ్యతను సాగునీటి సంఘాలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు తీసుకువస్తున్నామని, డిజిటల్ క్రాప్ సర్వే చేపడుతున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు రూ.810 కోట్ల రాయితీ అందించామని, రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామని చెప్పారు. డిమాండ్ ఆధారిత పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తామని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి గన్నవరం విమానాశ్రయం నుంచి ఎగుమతులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలవరం పూర్తయితే కృష్ణా డెల్టా ప్రాంతం మొత్తం సస్యశ్యామలం అవుతుందని, రాష్ట్రంలో సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## రేవంత్ దోపిడీపై వెంటనే దర్యాప్తు చేయండి: కేటీఆర్

- కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా వ్యవహారంపై సంచలన ఆరోపణలు
- ముఖ్యమంత్రి అధికార దుర్వినియోగం చేశారని విమర్శలు
- సాక్ష్యాధారాలు తారుమారయ్యాయని సందేహాలు
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసిన కేటీఆర్
- శాంతిభద్రతల పరిస్థితిపై కూడా ఆందోళన వ్యక్తం
- సీబీఐ దర్యాప్తు జరపాలని కేంద్రాన్ని కోరిన బీఆర్ఎస్ నేత





## సామాన్యులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు

- గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ప్రస్తుతం లోటు లేదు
- కమర్షియల్ గ్యాస్ సరఫరాలోనే సమస్యలు: మంత్రి ఉత్తమ్
- బ్లాక్‌మార్కెట్ అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం
- డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యల తప్పవని హెచ్చరిక

## రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

### వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత : డిప్యూటీ సీఎం భట్టి

- సేంద్రియ వ్యవసాయంలో స్వయం సహాయక సంఘాలకు అవకాశాలు
- వ్యవసాయ సంస్థలపై సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు ప్రతిపాదన
- సబ్సిడీపై యంత్రాలు, విత్తనాలు రైతులకు అందిస్తున్న ప్రభుత్వం
- ప్రీ బడ్జెట్ సమావేశంలో వ్యవసాయ ప్రతిపాదనలపై చర్చ



హైదరాబాద్: రైతుల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో వ్యవసాయ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సేంద్రియ మరియు సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో స్వయం సహాయక సంఘాలను

(మిగతా 2వ పేజీలో)

# మూసీ పునరుజ్జీవమే లక్ష్యం



ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంటే అక్కడే కొత్త ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మూసీ ఇన్‌వైట్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పర్యావరణవేత్తలు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రతినిధులు, మేధావులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. ఈ ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరి ఆస్తులను కూడా స్వాధీనం చేసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. పేదలతో శత్రుత్వం పెంచుకుని ఎవరైనా మళ్లీ అధికారంలోకి వస్తారా అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం భవిష్యత్ తరాల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. ప్రకృతిని, పర్యావరణాన్ని సంరక్షించడం ప్రతి తరానికి బాధ్యత అని చెప్పారు. వందేళ్లకు పైగా క్రితం నిజాం పాలకులు దూరదృష్టితో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తుచేశారు. 1908 మూసీ వరదల అనంతరం నగరాన్ని రక్షించేందుకు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వంటి జలాశయాలను నిర్మించిన విషయం ప్రస్తావించారు. అప్పటి పాలకులు చూపిన దూరదృష్టిలో కనీసం కొంతైనా మనం అనుసరించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలను కొందరు రాజకీయ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నాయని సీఎం ఆరోపించారు. 'మూసీ బ్యూటిఫికేషన్' పేరుతో చేపడుతున్న పనులను 'లూటిఫికేషన్'గా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. కొందరు అసత్య సమాచారంతో ప్రజల్లో అనవసర భయాలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో అర్ధసత్యాలను ప్రచారం చేస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ విగ్రహ నిర్మాణానికి భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారనే ప్రచారం కూడా తప్పుదారి పట్టించేదేనని సీఎం తెలిపారు. గాంధీ విగ్రహ నిర్మాణానికి కేవలం రూ.75 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని చెప్పారు. మొత్తం ప్రాజెక్టు పొడవు 55 కిలోమీటర్లు కాగా మొదటి దశలో 21 కిలోమీటర్ల అభివృద్ధికి మాత్రమే సుమారు రూ.7 వేల కోట్లు ఖర్చు అవుతాయని వివరించారు. మహాత్ముడి సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిదని అన్నారు. మానవ నాగరికత నదుల చుట్టూ అభివృద్ధి చెందిందని సీఎం గుర్తుచేశారు. హైదరాబాద్ నగర చరిత్రలో మూసీ నది కీలక పాత్ర పోషించిందని చెప్పారు. కానీ కాలక్రమేణా ఈ నది కాలుష్యంతో నిండిపోయి ప్రమాదకర స్థితికి చేరుకుందని తెలిపారు. ఈ నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లి ప్రజల ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తున్నదని అన్నారు. నల్లగొండ ప్రాంత ప్రజలు ఈ కాలుష్య ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, అది నగర సంస్కృతి, చరిత్రను కాపాడే ప్రయత్నమని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని చెప్పారు. నది పరివాహక ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ప్రాజెక్టు అమలులో ప్రజల సహకారం అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బాధితులకు ఎలాంటి పరిహారం ఇవ్వాలన్నదానిపై సూచనలు ఇస్తే ప్రభుత్వం పరిశీలించడానికి సిద్ధంగా ఉందన్నారు. అందరి సలహాలు, సూచనలతో ఈ ప్రాజెక్టును మరింత మెరుగ్గా అమలు చేస్తామని చెప్పారు. కానీ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా అడ్డుకోవడం సరైనది కాదని స్పష్టం చేశారు.రాష్ట్ర అభివృద్ధికి దూరదృష్టితో రూపొందించిన ప్రణాళికలు చరిత్రలో నిలిచిపోతాయని సీఎం పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్ నగరానికి కొత్త గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు. అందరి సహకారంతో ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు కూడా హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సామాన్యులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు

### గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ప్రస్తుతం లోటు లేదు

### కమర్షియల్ గ్యాస్ సరఫరాలోనే సమస్యలు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్: రాష్ట్రంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత ఉన్నదనే విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంగీకరించారు. అయితే సామాన్య ప్రజలకు వంటగ్యాస్ సమస్యలు రాకుండా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో మాత్రం ప్రస్తుతం ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 24వ జాతీయస్థాయి సాంకేతిక సదస్సు 'నిర్మాణ్26' ప్రారంభ కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన పలు సాంకేతిక నమూనాలను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో నిత్యం సరఫరా అయ్యే వంటగ్యాస్ సిలిండర్లలో సుమారు 86 శాతం గృహ వినియోగ కనెక్షన్లకే వెళ్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఈ విభాగంలో సరఫరా సవ్యంగా కొనసాగుతోందని చెప్పారు. అయితే వాణిజ్య వినియోగ సిలిండర్ల విషయంలో కొంత కొరత ఉన్నట్లు గుర్తించామని అన్నారు. హోటళ్లు, చిన్న వ్యాపారాలు ఎక్కువగా వినియోగించే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. సిలిండర్లు నల్లబజారుకు తరలకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. సరఫరా వ్యవస్థలో ఎలాంటి అక్రమాలు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి సిలిండర్లను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో రోజుకు ఎంతమంది వినియోగదారులకు ఎంతమేర గ్యాస్ అవసరమవుతుందనే అంశంపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని మంత్రి చెప్పారు. వాణిజ్య సిలిండర్ల కొరతకు గల కారణాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించనుందని వెల్లడించారు. ఈ అంశంపై శుక్రవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొరతను త్వరగా అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలించనున్నామని చెప్పారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

# మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు

### పేదలను దెబ్బతీస్తే మాత్రం పోరాటమే: రాంచందర్‌రావు



మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తమ పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము మూసీ నది శుద్ధికి లేదా అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విమర్శలకు కౌంటర్‌గా మాట్లాడిన ఆయన, మూసీ నది హైదరాబాద్ నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోందని తెలిపారు. అయితే, 'గాంధీ సరోవర్' వంటి ప్రాజెక్టుల కోసం మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదని, ఇళ్లకు నష్టం కలగకుండానే నదిని శుద్ధి చేయవచ్చని ఆయన సూచించారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఉదాహరణగా తీసుకునే వారు, అక్కడ నరేంద్ర మోదీ అనుసరించిన విధానాలను గమనించాలని రాంచందర్ రావు హితవు పలికారు. అక్కడ సుమారు 4 వేల కుటుంబాలకు ముందుగా పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను దెబ్బతీయకుండా చేసేదే నిజమైన అభివృద్ధి అని అన్నారు. గాంధీ విగ్రహాన్ని ఎంత ఎత్తులో నిర్మించినా తమకు అభ్యంతరం లేదని, కానీ పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం పోరాటం తప్పదని హెచ్చరించారు. మరోవైపు, దేశంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన బాధ్యతారాహిత్యంగా అభివర్ణించారు. అంతర్జాతీయంగా యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ ఇప్పటికే సంబంధిత దేశాలతో మాట్లాడి చమురు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. భారతదేశం కేవలం ఒక ప్రాంతంపైనే ఆధారపడదని, 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచి వస్తుందని చెప్పారు. రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని, కానీ గ్యాస్, పెట్రోల్ కొరత మాత్రం ఉండదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చిందని, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

# హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు: దేవ్‌జీ



మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన ఈరోజు ఒక మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు. మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.




### సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేయడంతో పాటు వివిధ డిమాండ్లపై కార్మికులు ఈ నోటీసు ఇచ్చారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో పేషీలో నోటీసులు ఇచ్చింది. లేబర్ కమిషనర్ కార్యాలయంలోనూ నోటీసులు ఇచ్చింది. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.


# ఇరాక్‌లో కూలిన అమెరికా సైనిక విమానం

ఇరాక్: పశ్చిమ ఇరాక్‌లో అమెరికా వైమానిక దళానికి చెందిన ఒక సైనిక విమానం కూలిపోయిన ఘటనలో విమానంలో ఉన్న ఆరుగురు సిబ్బంది మరణించారు. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ ధృవీకరించింది. ప్రమాదానికి గురైన విమానం కేసీ135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానం అని అధికారులు తెలిపారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న సైనిక చర్యల్లో భాగంగా ఈ విమానం గగనతలంలో ఇతర యుద్ధ విమానాలకు ఇంధనం అందించే పనిలో పాల్గొంటోంది. ఈ ప్రమాదంతో ఆపరేషన్‌లో అమెరికా సైనికుల మరణాల సంఖ్య పెరిగింది. ఇప్పటివరకు కనీసం పదమూడు మంది సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అందులో కొందరు యుద్ధ సమయంలో మరణించగా, మరికొందరు ఇతర కారణాల వల్ల మృతి చెందినట్లు అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది. ఈ ఆపరేషన్‌లో సుమారు నూట నలభై మంది సైనికులు గాయపడినట్లు కూడా సమాచారం అందింది. ప్రమాద సమయంలో రెండు కేసీ135 విమానాలు ఒకే మిషన్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. ఈ మిషన్ 'ఫ్రెండ్లీ ఎయిర్‌స్పేస్' పరిధిలో కొనసాగుతున్నదని పేర్కొన్నారు. అయితే ఆ రెండు విమానాల్లో ఒకటి కూలిపోగా, మరొక విమానం సురక్షితంగా ఇజ్రాయెల్‌లోని విమానాశ్రయంలో దిగింది. ప్రమాదానికి శత్రు కాల్పులు లేదా మిత్ర బలగాల కాల్పులు కారణం కాదని అమెరికా సైన్యం స్పష్టం చేసింది. ఇరాన్ మద్దతు ఉన్న ఇరాకీ మిలిటెంట్ గుంపులు ఈ విమానాన్ని తమ దాడిలో కూల్చివేశామని ప్రకటించాయి. కానీ అమెరికా సైన్యం ఆ వాదనను ఖండించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ప్రమాదం గగనతలంలో జరిగిన సాంకేతిక సమస్య లేదా మిడ్-ఎయిర్ ఘటన కారణంగా జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోంది. కేసీ135 స్ట్రాటోట్యాంకర్ విమానం అమెరికా వైమానిక దళంలో చాలా కాలంగా సేవలందిస్తున్న ప్రధాన విమానాలలో ఒకటి. బోయింగ్ 707 నమూనా ఆధారంగా రూపొందించిన ఈ విమానం ఆరు దశాబ్దాలకుపైగా సేవలందిస్తోంది. గగనతలంలోనే యుద్ధ విమానాలకు ఇంధనం నింపడం ఈ విమానాల ప్రధాన బాధ్యత. అదనంగా వైద్య అత్యవసర తరలింపులు, నిఘా కార్యకలాపాలు వంటి పలు మిషన్లలో కూడా వీటిని వినియోగిస్తారు. సాధారణంగా ఈ విమానంలో పైలట్, సహ పైలట్, బూమ్ ఆపరేటర్ అనే ముగ్గురు సిబ్బంది ఉంటారు. ప్రత్యేక మిషన్లలో మరికొందరు సిబ్బంది కూడా పాల్గొంటారు. అయితే ఈ విమానాలు చాలా కాలంగా సేవలందిస్తున్న కారణంగా వాటి విశ్వసనీయతపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. అమెరికా వైమానిక దళం ఈ విమానాలను కొత్త కేసీ46ఏ పెగాసస్ విమానాలతో భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ ఆ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతోంది. గతంలో కూడా కేసీ135 విమానాలకు సంబంధించి పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 2013లో ఆఫ్ఘనిస్తాన్ మద్దతు కార్యకలాపాల్లో పాల్గొన్న ఒక కేసీ135 విమానం కిర్గిజిస్తాన్ నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయి ముగ్గురు సిబ్బంది మరణించారు. అలాగే 1966లో స్పెయిన్ సమీపంలో బీ52 బాంబర్ విమానంతో ఢీకొన్న ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల ఇరాన్‌కు సంబంధించిన యుద్ధ పరిస్థితుల మధ్య జరిగిన ఈ తాజా ప్రమాదం అమెరికా సైనిక చర్యలపై మరింత దృష్టిని ఆకర్షించింది. ఈ ఘటనపై దర్యాప్తు పూర్తయ్యాక ప్రమాదానికి అసలు కారణాలు వెల్లడవుతాయని అమెరికా అధికారులు తెలిపారు.

# రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

భాగస్వాములుగా చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. మహిళా సంఘాల ద్వారా కూరగాయలు, పూల సాగును ప్రోత్సహించి వాటికి సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని తెలిపారు. దీంతో గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. వ్యవసాయ శాఖకు చెందిన రైతు వేదికలు, మార్కెట్ యార్డులు, గోదాములు వంటి భవనాలపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం ప్రతిపాదించారు. ఈ విధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తే శాఖకు విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును విక్రయించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీని ద్వారా వ్యవసాయ శాఖ ఆర్థికంగా మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు సంబంధించిన చర్యల కోసం రెడ్కో సంస్థతో సంప్రదించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రత్యేకంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు పెద్ద ఎత్తున అందజేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా విత్తనాలను కూడా సబ్సిడీపై రైతులకు అందిస్తున్నామని వివరించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు అందుతున్న ఈ పథకాల ప్రయోజనాలను వారికి స్పష్టంగా వివరించాల్సిన అవసరం ఉందని మంత్రులు సూచించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గ్రామస్థాయిలో ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సమావేశంలో రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల కింద సాగుతున్న పంటల పరిస్థితిపై కూడా చర్చ జరిగింది. నీటి సరఫరా పరిస్థితులు, యాసంగి వరి సాగు, త్వరలో మార్కెట్లోకి రానున్న ధాన్యం సేకరణ వంటి అంశాలను మంత్రులు సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జానయ్యతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతు సంక్షేమాన్ని ప్రధానంగా దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సమావేశంలో సూచించారు.

# రేవంత్ దోపిడీపై వెంటనే దర్యాప్తు చేయండి: కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వివాదం రేగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థపై సమగ్ర దర్యాప్తు జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసి పలు ఆరోపణలు చేశారు. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థకు సంబంధించిన ఆర్థిక అవకతవకలు, బ్యాంకులను మోసగించడం వంటి అంశాలపై ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ సంస్థను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. విచారణలో భాగంగా సేకరించిన కీలక సాక్ష్యాధారాలు తారుమారయ్యాయని అధికారులు హైకోర్టుకు తెలియజేసిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. ఈ పరిణామం వ్యవహారం ఎంత తీవ్రమైనదో సూచిస్తోందని ఆయన అన్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆధారాలను మార్చే ప్రయత్నం జరిగిందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితి దిగజారుతున్నదానికి నిదర్శనమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రజలకు న్యాయం జరగాలంటే ఈ వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అందుకే ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అప్పగించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరినట్లు కేటీఆర్ తెలిపారు. పూర్తిస్థాయి దర్యాప్తు జరిగితే నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

# ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలు పోయినా మరిన్ని వస్తాయి

## గీతం కాంక్లేవ్‌లో అభిప్రాయపడ్డ పరిశ్రమ నిపుణులు



పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : కృత్రిమ మేధస్సు (ఏఐ) విస్తృత వినియోగం వల్ల తొలి దశలో కొన్ని ఉద్యోగాలు పోయినా, ముమ్ముందు మరిన్ని అందుబాటులోకి వస్తాయని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడ్డారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలను ఏఐ స్థానభ్రంశం చేయవచ్చని, అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు అందుబాటులో వస్తాయని అంచనా వేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని కెరీర్ గైడెన్స్ సెంటర్ (సీజీసీ) ఆధ్వర్యంలో 'భవిష్యత్తును ఇంజనీరింగ్ చేయడం: ప్రధాన రంగాలలో ఆవిష్కరణలు' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన మూడవ దఫా ఇండస్ట్రీ కాంక్లేవ్ విజయవంతంగా ముగిసింది. రానున్న రోజులలో ఉద్యోగ మార్కెట్ విస్తరిస్తూనే ఉంటుందని, అయితే ఏఐ ఆధారిత యుగానికి తగిన నైపుణ్యాలను విద్యార్థులు సమకూర్చుకోవాలని నిపుణులు సూచించారు. ముఖ్యంగా ఇంటర్న్ షిప్‌లు, పరిశ్రమల సందర్శన, ఆచరణాత్మక అభ్యాసం ద్వారా తమ జ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరచుకోవాలన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను, ముఖ్యంగా రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారిన ఏఐపై పట్టు సాధించాలని ప్రోత్సహించారు. పరిశ్రమతో సహకారం, చురుకైన అభ్యాసం, సానుకూల దృక్పథం యొక్క ప్రాముఖ్యతను కూడా వారు నొక్కి చెప్పారు. సాంకేతిక నైపుణ్యాలు, జ్ఞానానికి మించి నియామకాలలో 75 శాతం విజయానికి ఆయా అభ్యర్థుల ప్రవర్తన, వైఖరి కారణమని వారు స్పష్టీకరించారు. కోర్ ఇంజనీరింగ్ కు పెద్దపీట వేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టడంపై గీతం యాజమాన్యాన్ని అభినందించారు. దీనివల్ల పరిశ్రమ-విద్యా సంస్థల మధ్య అంతరం తగ్గి అందరికీ మేలు జరుగుతుందన్నారు.

ఈ కాంక్లేవ్ ప్రారంభోత్సవంలో ఎన్ఎక్స్ పీ సెమీకండక్టర్స్‌లో ఇండియా ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అధిపతి ప్రీత్ యాదవ్, స్టెల్లాంటిస్ లో డెలివరీ లీడ్ సుమన్ గోర్లా ముఖ్య అతిథులుగా పాల్గొని, కీలకోపన్యాసాలు చేశారు. కోర్ ఇంజనీరింగ్ రంగాల భవిష్యత్తును రూపొందించడంలో ఆవిష్కరణ, పరిశ్రమ-విద్యా సంస్థల సహకారం యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను వారు ప్రధానంగా ప్రస్తావించారు. ఇండస్ట్రీ కాంక్లేవ్ లో భాగంగా, ప్రముఖ పరిశ్రమ నిపుణులతో మూడు ప్యానెల్ చర్చలు జరిగాయి. 'పారిశ్రామిక భవిష్యత్తును నడిపించడం: శక్తి, చలనశీలత, తయారీ' శీర్షికన జరిగిన తొలి ప్యానెల్ చర్చలో యాక్సిస్ ఎనర్జీ మానవ వనరుల విభాగాధిపతి వీణ పుత్రేవుల; ప్రజ్ ఇండస్ట్రీస్ డీజీఎం యోగేష్ ఖటాలే; ఓడీఎఫ్ డీజీఎం కె.సి. మోహన్; అల్ట్రాటెక్ అధిపతి (ఆపరేషన్స్-సెల్స్) ఎన్. శ్రీనివాసరావు పాల్గొన్నారు. దీనిని మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయ ప్రకాష్ శ్రీవాస్తవ సమన్వయం చేశారు.

'వ్యూహాత్మక మార్పు: హార్స్ పవర్ నుంచి కంప్యూట్ పవర్'కు అనే అంశంపై నిర్వహించిన రెండో ప్యానెల్ చర్చలో డ్రోనవేషన్ ఇండస్ట్రియల్ ఏఐ డ్రోన్ సీఈవో డాక్టర్ సౌరభ్ శ్రీవాస్తవ; ఎంఓసార్ట్స్ సీటీవో డాక్టర్ ఎ. కృష్ణకాంత్; అనలాగ్ పోర్ట్ లో అనలాగ్ ఇంజనీరింగ్ డైరెక్టర్ వై. షమీర్; బాష్ ఫంక్షనల్ ఎక్సలెన్స్ లీడ్ వంశీ మగపు; గ్లోబల్ ఫౌండ్రీస్ ఎస్ఎంటీఎస్ డిజైన్ ఇంజనీర్ ప్రియాంకర్ మాథురియా పాల్గొన్నారు. దీనిని గీతం బీటెక్ (ఈఈసీఈ) మూడో ఏడాది విద్యార్థిని పర్ణిక సురేష్ సూరిసెట్టి సమన్వయం చేశారు. 'సాంకేతిక నైపుణ్యాలకు మించి సామర్థ్యాలను పెంపొందించడం: కోర్ ఇంజనీరింగ్ లో అవకాశాలు' శీర్షిక జరిగిన మూడో ప్యానెల్ చర్చలో బాష్ యూనివర్సిటీ రిలేషన్స్ ప్రణీత్ సరన్; స్టెల్లాంటిస్ లోని టాలెంట్ అక్విజిషన్ లీడ్ నిషితా రాయ్ పాల్గొనగా, సీజీసీ ప్రతినిధి ఎల్. వంశీకృష్ణ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ప్యానలిస్టులు గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాలను సందర్శించారు. అధునాతన అభ్యాసం, పరిశోధనలకు మద్దతుగా ప్రపంచ స్థాయి సౌకర్యాలను ఏర్పాటు చేసినందుకు విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని వారు అభినందించారు. తొలుత, గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు స్వాగతోపన్యాసం చేయగా, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి సూచించారు. సీజీసీ అసిస్టెంట్ మేనేజర్ కె.వాసుదేవ్ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఇందులో సీజీసీ డైరెక్టర్ డాక్టర్ కె. మమతారెడ్డి, కోర్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మీనాక్షికి రావలసిన వేత్తనం ఇప్పించిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

కుత్బుల్లాపూర్ మార్చ్ 13(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చింతల్ లోని వెంకన్న కాలేజీ లో రిసెప్షన్ గా పనిచేస్తున్న మీనాక్షి, గత కొన్ని నెలలు నుంచి పని చేస్తుంది, మీనాక్షి అనే మహిళ, కొన్ని అనివార్య కారణాలవల్ల మీనాక్షి కి రావాల్సిన వేతనం రెండు నెలల 20 రోజుల వేతనం మొత్తం 48000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో వెంకన్న కాలేజ్ రిసెప్షన్ లో పని మానేయడం జరిగింది... ఆ మహిళ మీనాక్షికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి మహిళ మిత్రురాల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి ఆఫీస్ వద్దకు వెళ్లి మీనాక్షి కి జరిగిన అన్యాయం గురించి వివరించారు, వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన "చింతల్ లో ఉన్న వెంకన్న కాలేజ్" మేనేజ్ మెంట్ తో పలుమార్లు చర్చించి మీనాక్షి కి రావలసిన వేతనం 48000/- వేల రూపాయలు మొత్తం ఇప్పించడం జరిగింది... మీనాక్షి మాట్లాడుతూ ,నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు... ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ తోఫాలను పంపిణీ చేసిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- సెవెన్ హిల్స్ కాలనీ అక్సా మసీదులో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన రంజాన్ తోఫాల పంపిణీకి పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో కమిటీ అధ్యక్షులు ఆఫ్జాల్,అబ్దుల్ సత్తార్ ,ఖాదర్ బాషా ,బాషా ,ఖాదర్ వలి ,సలీమ్ ,ఖలీల్ ,తదితరులు పాల్గొన్నారు సుంకు శేఖర్ రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, మంద మురళి కృష్ణారెడ్డి, అమర్, సత్యం, ప్రేమ్ గౌడ్,ప్రణయ్ యాదవ్, తుమ్మల దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భౌరంపేట్ లహారి గ్రీన్ పార్క్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



కుత్బుల్లాపూర్ మార్చి 13(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ లోని లహారి గ్రీన్ పార్క్ కాలనీ లో గల సమస్యల గురించి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద విన్నవించుకోగా వారు స్థానిక నాయకులతో కలిసి కాలనీలో పర్యటించారు. అనంతరం వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. దాదాపు 1000 కుటుంబాల వరకు ఉండే ఈ కాలనీ లో రోడ్డు, స్ట్రీట్ లైట్స్ , వాటర్ మరియు డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు తెలుపగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. కాలనీ లో గల రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కారం అయ్యేలా తగు చర్యలు తీసుకుంటానని తెలియజేసారు. తప్పకుండా కాలనీ కి అన్ని వసతులు కల్పించేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ బాల్ రెడ్డి భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి బి.ఆర్.ఎస్ నాయకులు బెంబెడి బుచ్చిరెడ్డి ధర్మారెడ్డి మురళీ యాదవ్ విష్ణువర్ధన్ రెడ్డి కామేశ్వరరావు మరియు కాలనీ సెక్రటరీ ఎ.శ్రీనివాస్ రావు ఆర్గనైసింగ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి మురళి కృష్ణ ప్రశాంత్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికురాలు అనిత కుటుంబానికి అండగా ఉంటాం

### - భువనగిరి మున్సిపల్ చైర్మన్ తశీగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో (వాయిస్ టుడే ప్రతినిధి ):- విధి నిర్వహణలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు వారికి ఎలాంటి ఆపద వచ్చినా తాను వారి వెన్నంటి ఉంటానని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. భువనగిరి పట్టణంలో నిత్యం పారిశుద్ధ పనులలో నిమగ్నమై పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దే కార్మికుల వైపు తాను ఎల్లవేళలా ఉండి వారి బాగోగులను ఎల్లవేళలా చూస్తానని ఆమె పేర్కొన్నారు. కార్మికులు మంచి ఉంటేనే భువనగిరి పట్టణ పారిశుభ్రత ఎంతో బాగుంటుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. అనంతరం భువనగిరి పట్టణం లో స్థానిక శివ నగర్ కు చెందిన మున్సిపల్ కార్మికురాలు ఆడెపు అనిత అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా వారి కుటుంబానికి భువనగిరి మున్సిపల్ చైర్మన్ తశీగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ పరామర్శించి వారి కుటుంబాని కి ఆర్థిక సహాయం చేసి..వారి కుటుంబానికి అండగా ఉంటామని హమి ఇచ్చారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గోన్నారు.

## పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ నూతన చైర్మన్ శివానందం



పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన ఏపూరి శివానందం, వైస్ చైర్మన్ గా మాదాసు రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నూతన చైర్మన్ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శివానందం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, మరియు ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆశీస్సులతో ఈ పదవి దక్కిందని చైర్మన్ పేర్కొన్నారు. తన పై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన సాయశక్తులా కృషి చేస్తానని, రైతుల సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యత అని చైర్మన్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్ది, పార్టీకి మరియు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తానని ధీమా వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, పారదర్శకమైన పాలన అందిస్తానని హామీ ఇచ్చారు.



## మంచినీటి సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది

### మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్ మార్చ్ 13(వాయిస్ టుడే) : వేసవికాలం ఆరంభంలోనే తాగునీటిని అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జగద్గిరి గుట్ట డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆరోపించారు. జగద్గిరిగుట్ట డివిజన్ ఆర్ జి కే కాలనీలో గత రెండు నెలల నుండి మంచినీటి సరఫరా చేయడం లేదని కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ కు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కాలనీవాసులతో కలిసి జగద్గిరిగుట్ట జలమండలి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో రోజు విడిచి మూడు గంటల పాటు నిరవధికంగా మంచినీటి సరఫరా చేసి స్థానిక ప్రజలకు ఎలాంటి నీటి కొరత లేకుండా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తుందని అది కూడా కేవలం ఒక గంట పాటు మాత్రమే సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మార్చి నెలలోనే తాగునీటి కొరత ఉంటే ఏప్రిల్, మే మాసంలో పరిస్థితిని అంచనా వేస్తేనే భయంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మపురి అంజయ్య. నాయకులు భూపతి రెడ్డి. పరశురాములు వెంకటస్వామి గౌడ్., నరసింహారెడ్డి హనుమంతు బ్రహ్మాచారి. సంపత్ రెడ్డి సునీల్ రెడ్డి. కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కుత్బుల్లాపూర్ తెలంగాణ జాగృతి నేతల జన్మదిన శుభాకాంక్షలు

కుత్బుల్లాపూర్ మార్చ్ 13(వాయిస్ టుడే): తెలంగాణ జాగృతి కుత్బుల్లాపూర్ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పుట్టినరోజు శుభాకాంక్షలు తెల్పుమా వారు సంధ్యా రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి మహిళా అధ్యక్షురాలు బి. నవీన్, పి. ఊర్మిళ, మనీష్,ప్రశాంత్,శేఖర్,రాకేష్ సమీర్.



## టిడబ్ల్యూజేఎఫ్ డైరీ ఆవిష్కరించిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

కుత్బుల్లాపూర్ మార్చ్ 13(వాయిస్ టుడే): టిడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజక స్థాయి కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆవిష్కరించి అనంతరం వారు మాట్లాడుతూ.... నిత్యం జనం సమస్యలు సామాజిక సమస్య ఆర్థిక సమస్యలపైన వార్తలు రాసే జర్నలిస్టులు డైరీని తీసుకువచ్చి మరింత వన్నె తెచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టులకు అండగా ఉండు మీ సమస్యల్లో భాగమైతానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం అక్రిడేషన్ కార్డులు హెల్త్ కార్డులు అందించింది నేటి ప్రభుత్వం జర్నలిస్టులను పట్టించుకోవడంలేదని తెలిపారు. అసెంబ్లీలో వీటిపై చర్చిస్తానన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. కేంద్ర ప్రభుత్వ సంస్థ భారత న్యూస్ పేపర్స్ రిజిస్ట్రార్(=చీ×)/ భారత ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్(ూ=+×) అనుమతి పొంది, కొన్నేళ్లుగా అష్ట కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఎంతోమంది సీనియర్ జర్నలిస్టులు నడుపుతున్న అన్ని తరహా పత్రికలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకుండా, ఎంపానల్మెంట్ చేయకుండా, కనీసం అక్రిడిటేషన్లు ఇవ్వకుండా అణచివేస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన ఈ స్థానిక పత్రికల జర్నలిస్టుల పట్ల పాలకుల వివక్ష పోవాలి. తక్షణమే అన్ని పత్రికలను గుర్తించాలని కోరారు. ఈకార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్, జాతీయ కౌన్సిల్ సభ్యులు దామెర జగదీశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జెమిని నాగరాజు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు, పి.శంకర్, టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయి వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, ప్రధాన కార్యదర్శి అంగూరు గోవిందరావు, ప్రచార కార్యదర్శి సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షులు మంజుల రెడ్డి, ఎం.సుస్మిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సాయి బాబా నగర్‌లో కాంగ్రెస్ నేత హరి కిరణ్ పటేల్ జన్మదిన వేడుకలు

### - హన్మంత్ రెడ్డి శుభాకాంక్షలు

కుత్బుల్లాపూర్ మార్చ్ 13(వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సాయి బాబా నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు హరి కిరణ్ పటేల్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన వేడుకలల్లో పాల్గొన్నా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అనంతరం హన్మంతన్న శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'అవంతి'కి అటానమస్ హోదా




హైదరాబాద్, మార్చి13: అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో గల అవంతి విద్యాసంస్థల ఆవరణలో ఉన్న అవంతి ఫార్మసీ కళాశాలకు యూజీసీ స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్) లభించింది. ఈ హోదా దాదాపు పదేళ్ల పాటు కొనసాగనున్నట్లు కళాశాల చైర్మన్ ముత్తెంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. దీంతో పాటు జెఎన్టీయూహెచ్ నుంచి కూడా స్వయంప్రతిపత్తి హోదా లభించిందని హర్షం వ్యక్తం చేస్తూ కళాశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. విశిష్టమైన గుర్తింపు లభించడంతో తమ విద్యాసంస్థల్లో విద్య నాణ్యతతో పాటు పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత కట్టుబడితో పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత టైలరింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



కూకట్ పల్లి, మార్చి 13: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ కూకట్ పల్లి ఆధ్వర్యంలో మహిళలకు 15 రోజుల ఉచిత టైలరింగ్ కోర్సు నిర్వహిస్తున్నట్లు కూకట్ పల్లి బ్రాంచ్ డైరెక్టర్ దీపిక తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కలిగిన ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల పట్ల మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఇటువంటి వృత్తి విద్యా కోర్సుల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. సంస్థ మంచి ఉద్దేశంతో మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ రంగంలో అవగాహన కల్పించేందుకు 15 రోజుల ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్స్ పూర్తి చేసిన అనంతరం సర్టిఫికెట్స్ ఇవ్వబడుతుందని ఆమె తెలిపారు . ఈ కోర్సులో రోజుకు 3 గంటల శిక్షణ అందించబడుతుందని చెప్పారు. ఈ శిక్షణలో రోజుకు రెండు బ్యాచ్ లు ఉంటాయి:

మొదటి బ్యాచ్: ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రెండవ బ్యాచ్: మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఈ నెల 16వ తేదీ నుండిశిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. టైలరింగ్ నేర్చుకోవాలనుకునే ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్: 9573909009/




## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు

హైదరాబాద్, మార్చి 13: తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గుమ్మడి క్రాంతి ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడ చౌరస్తా లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా విద్యార్థి నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి కవితక్క జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుమ్మడి క్రాంతి మాట్లాడుతూ ఉద్యమ నేత తెలంగాణ సాంస్కృతిక విలువలను ప్రపంచానికి పరిచయం చేయడంలో కవితక్క చేసిన కృషి అభినందనీయమని అన్నారు. మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. అక్క నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో తెలంగాణ ప్రజల ఆశీస్సుల తో మునుముందు ఎన్నో గొప్ప శిఖరాలను అలంకరించాలని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు.

## హైడ్రాకు ఎన్‌ఆర్‌ఎస్‌సీ డేటా వజ్రాయుధం

**ఆ సమాచారంతో పక్కాగా ఎఫ్‌టీఎల్ లెక్కలు**

**ఎన్‌ఆర్‌ఎస్‌సీ సదస్సులో హైడ్రా కమిషనర్**

హైదరాబాద్: కనుమరుగైపోయిన చెరువుల జాడ తెలుసుకోవడంతోపాటు ఉన్నవాటి ఎఫ్‌టీఎల్ లెక్కలు తేల్చడానికి నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) అందిస్తున్న ఉపగ్రహ ఆధారిత డేటా హైడ్రాకు 'వజ్రాయుధం'లా మారిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. 'వికసిత్ భారత్-2047 సాధనలో భూమి పరిశీలన విధానాలు-ధోరణులు, సవాళ్లు' అంశంపై ఎన్‌ఆర్‌ఎస్‌సీ సెంటర్లో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 'చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో కాకుండా.. ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల లెక్క తేల్చడంలో ఎన్‌ఆర్‌ఎస్‌సీ డేటా హైడ్రాకు ఎంతగానో ఉపయోగపడింది. అని వెల్లడించారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌లోని చెరువుల నీటి నాణ్యతపై ఉపగ్రహ ఆధారిత అధ్యయనాలు నిర్వహించడానికి ఎన్‌ఆర్‌ఎస్‌సీ సహకరించాలని రంగనాథ్ కోరారు. నీటి వనరులను కాపాడటంలో హైడ్రా చొరవ అభినందనీయమని ఇస్రో ఛైర్మన్ డా.వి.నారాయణన్ అన్నారు. ఇస్రో సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు చేరవేయడంలో హైడ్రా చొరవ మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ డా.ప్రకాశ్‌చౌహాన్, ఇస్రో మాజీ ఛైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ మాట్లాడారు.

**'హైడ్రా-రక్ష' పోర్టల్ ప్రారంభం**

కార్యక్రమంలో 'హైడ్రా-రక్ష' పోర్టల్‌ని ప్రారంభించారు. ఓఆర్ఆర్ పరిధిలో చెరువులు, నాలాల హద్దులు తెలుసుకోవడానికి ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. కొనుగోలు చేసే ప్లాట్లు చెరువుల చెంత.. నాలాల బఫర్‌లో ఉన్నాయా? అనేది తెలుసుకోవచ్చు. పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చాక ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.





# శేరిలింగంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు బీజేపీ మహా ధర్నా

శేరిలింగంపల్లి, మార్చి 13 (వాయిస్ టుడే): అర్హులైన పేదలకు వెంటనే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు, కార్యకర్తలు మరియు గృహ పథకాల దరఖాస్తుదారులు శేరిలింగంపల్లి ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజి రెడ్డి హాజరయ్యారు. ధర్నాలో పాల్గొనేందుకు నాయకులు మరియు పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజి రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు కనీసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) నిధులతో అయినా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు.

రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఆరోపించారు. రెండు సంవత్సరాలకు పైగా గడిచినా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఒక్క అర్హుడికీ కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వ కాలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించినప్పటికీ వేలాది దరఖాస్తులు వచ్చినా చాలా తక్కువ సంఖ్యలోనే ఇళ్లు నిర్మించబడ్డాయని తెలిపారు. సుమారు 50 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నప్పటికీ కేవలం కొన్ని వందల మందికే ఇళ్లు కేటాయించబడినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పేదల గృహ నిర్మాణంపై పూర్తిగా నిర్లక్ష్యం చూపుతోందని, మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నప్పటికీ పీఎంఏవై పథకం కింద ఇళ్లు ఎందుకు నిర్మించడంలేదని ప్రశ్నించారు.

స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పనుల్లో విఫలమయ్యారని, నియోజకవర్గంలో కొత్త ఆసుపత్రులు, పాఠశాలలు లేదా కళాశాలలు ఏర్పాటు కాలేదని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై కాకుండా భూమి సమస్యలు, ఆదాయ వసూళ్లపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని విమర్శించారు. ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం ఆలస్యం కొనసాగితే బీజేపీ రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని రవికుమార్ యాదవ్ హెచ్చరించారు. ధర్నా అనంతరం బీజేపీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి అర్హులైన వారికి వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, బుచ్చి రెడ్డి, రాఘవేంద్ర రావు, నాగుల్ గౌడ్, రాధాకృష్ణ యాదవ్, అనిల్ గౌడ్, శ్రావంతి, కృష్ణంరాజు, దుర్గాప్రసాద్, మాణిక్ రావు, ఎల్లేష్, పద్మ, రామరాజు, కేశవులు, నరసింహాచారి, ఆకుల లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, జితేందర్, వరలక్ష్మి, వెంకటస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు: ఏసిపి సాయిబాబా



సికింద్రాబాద్, మార్చ్ 13 (వాయిస్ టుడే ప్రతినిది): ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిహెచ్ఎంసి అధికారి ఏసిపి సాయిబాబా హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ లోని ఇంద్ర పార్క్, ధర్నా చౌక్ ప్రాంతాల్లో ప్రధాన రహదారి కి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ అక్రమణలను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. కవాడిగూడ సర్కిల్ పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన డబ్బాలు, చిన్న నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కిష్టయ్య ఆధ్వర్యంలో సిబ్బంది, పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీ సాయం తో ఫుట్‌పాత్‌లపై ఉన్న అక్రమ డబ్బాలు మరియు నిర్మాణాలను తొలగించారు. పాదచారులకు ఇబ్బందులు కలగకుండా ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించామని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక మామ, దివంగత కొంతం నర్సింగ్ రావు మరణం పట్ల సికింద్రాబాద్‌లోని మారేడ్‌పల్లిలో, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవండి

**చిక్కడపల్లి ఏసిపి రమేష్ కుమార్...**

**చిక్కడపల్లి ట్రాఫిక్ సిఐ ఏడుకొండలు...**

సికింద్రాబాద్, మార్చ్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): యువకులు, విద్యార్థులు ముందుండి రక్తదానం చేసి ప్రాణ దాతలు గా నిలవాలని చిక్కడపల్లి ఏసిపి రమేష్ కుమార్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భగత్ సింగ్ స్మారక యువజన ఉత్సవాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరనికి ముఖ్య అతిథిలు గా చిక్కడపల్లి ఏసిపి రమేష్ కుమార్, ట్రాఫిక్ సీఐ ఏడుకొండలు, కాచిగూడ సీఐ రాజశేఖర్ లు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సేవ కార్యక్రమల్లో విస్తృతంగా పాల్గొనాలన్నారు. ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నిర్వహిస్తున్న సేవ కార్యక్రమలను అభినందించారు. సమాజం లో జరుగుతున్న అన్యాయాలు, అవినీతి, నిరుద్యోగం, విద్యా వ్యాపారీకరణ, మాదక ద్రవ్యాల వ్యాప్తి వంటి సమస్యలపై యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రశ్నించే యువతే సమాజ మార్పుకు మార్గం చూపుతుందన్నారు.

దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యార్థులపై పెరుగుతున్న భారాలు, యువతను మాదకద్రవ్యాల బారిన పడేలా చేస్తున్న శక్తులను ఎదిరించడం ప్రతి చైతన్యవంతమైన విద్యార్థి, యువకుడి బాధ్యత అని చెప్పారు. నేటి యువత వినోద,చెడు వ్యసనాలకు అలవాటు పడి వారి జీవతాలను ఆగం చేసుకుంటున్నారనీ, అలాంటి వాటికి దూరంగా ఉండి, భగత్ సింగ్ స్పూర్తి తో మంచి భవిష్యత్తు కోసం దారి చూపే సంఘాలలో పని చేయాలని అన్నారు. డి వై ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శిలు కోట రమేష్, వెంకటేష్ లు మాట్లాడుతూ ఎస్ ఎఫ్ ఐ, డి వై ఎఫ్ ఐ సంయుక్తంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా మండల కేద్రలలో భగత్ సింగ్ యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలని విద్యార్థులు, యువత విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ పి ఎం బ్లెడ్ బ్యాంక్ ఇచ్చార్జి మాదవి, ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు అశోక్ రెడ్డి, లెనిన్,జావీద్, రాజయ్య, రజనీకాంత్,ప్రవీణ్,అర్జున్, ఆశ్వక్, మనోజ్, మదన్ తదితరులు పాలొగొన్నారు.

# వికలాంగుల పెన్షన్ 6000కు పెంచాలి

**బడ్జెట్లో నిధులు కేటాయింపు పెంచాలి....**

**వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ...**

సికింద్రాబాద్, మార్చి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): వికలాంగుల పెన్షన్‌ను రూ.6000లకు పెంచాలని, వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్ లో తగిన నిధులు కేటాయించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద వికలాంగులు ధర్నా నిర్వహించి తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వికలాంగులకు అమలు చేస్తున్న పథకాలకు నిధుల కేటాయింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. కేటాయించిన నిధులను సమయానికి విడుదల చేయకపోవడం వల్ల వికలాంగులకు ప్రతి నెల పెన్షన్లు సకాలంలో అందడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం




అందిస్తున్న రూ.300 పెన్షన్‌తో వికలాంగుల కుటుంబాలు జీవనం కొనసాగించడం చాలా కష్టమని తెలిపారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ మొత్తాన్ని పెంచి బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల పెన్షన్‌ను రూ.4016 నుంచి రూ.6000లకు పెంచుతామని మేనిఫెస్టోలో ప్రకటించిన ప్పటికీ, ప్రభుత్వం ఏర్పడి 27 నెలలు గడిచినా పెంపుపై నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. వికలాంగుల పెన్షన్లలో కూడా వేలాది మంది లబ్ధిదారులను తొలగించినట్లు తెలిపారు. చేయూత పెన్షన్ల కోసం ప్రతి నెల రూ.994.50 కోట్లు అవసరమని, 2024--25 ఆర్థిక సంవత్సరంలో రూ.14,628.91 కోట్లు కేటాయించినప్పటికీ అందులో రూ.10,514.32 కోట్లు మాత్రమే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వికలాంగుల సంక్షేమానికి మొత్తం బడ్జెట్‌లో కనీసం 5 శాతం నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా సహాయ పరికరాల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎంపికైన లబ్ధిదారులకు పరికరాలు పంపిణీ చేయడం లేదని విమర్శించారు. మార్చి 20న ప్రవేశపెట్టే 2026--27 రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల పెన్షన్ పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా "మా రాముడు అందరివాడు" మూవీ సాంగ్ విడుదల

హైదరాబాద్ : వాయిస్ టుడే : యంగ్ టాలెంటెడ్ హీరో శ్రీరామ్ నటిస్తున్న కొత్త సినిమా "మా రాముడు అందరివాడు"లోని 'ఇడిసెల్లిపోయావా..' పాటను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విడుదల చేశారు. ఈ చిత్రాన్ని అనుముల ప్రొడక్షన్స్, శ్రీరామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మిస్తున్నారు. యద్దనపూడి మైకేల్ దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాత అనుముల లక్ష్మణరావు ఈ చిత్రంలో విలన్ గా నటిస్తున్నారు. శ్రీరామ్ సరసన స్వాతి హీరోయిన్ గా కనిపించనుంది. సుమన్, సమ్మెట గాంధీ, నాగ మహేష్, బాహుబలి ప్రభాకర్, ఆనంద్ భారతి, జబర్దస్ అప్పారావు, చిట్టి బాబు, గడ్డం నవీన్, కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలో "మా రాముడు అందరివాడు" సినిమా పాన్ ఇండియా రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ఈ సినిమాలోని 'ఇడిసెల్లిపోయావా..' సాంగ్ లాంఛ్ చేశారు. ఈ పాటకు డైరెక్టర్ యద్ధనపూడి మైఖేల్ సాహిత్యాన్ని అందించి,




నల్లగొండ గద్దర్ గా ప్రసిద్ధమైన నర్సారెడ్డి తో కలిసి పాడారు. 'ఇడిసెల్లిపోయావా..' సాంగ్ లాంఛ్ కార్యక్రమంలో హీరో శ్రీరామ్, నిర్మాత, నటుడు అనుముల లక్ష్మణరావు, డైరెక్టర్, సాంగ్ రైటర్ యద్ధనపూడి మైఖేల్, సింగర్ నల్లగొండ గద్దర్ నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు. "మా రాముడు అందరివాడు" సినిమాలో తండ్రిని కోల్పోయిన కొడుకు, అలాగే గొప్ప వ్యక్తిని కోల్పోయామని ఊరి ప్రజలు కలిసి విషాధంతో పాడుకునే ఒక అద్భుతమైన పాట 'ఇడిసెల్లిపోయావా..'. ఈ పాట చాలా బాగుందని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశంసించారు. 'ఇడిసెల్లిపోయావా..' పాటను, పాట పోస్టర్స్ ను ఆయన లాంఛ్ చేసి, సాంగ్ విన్నారు. "మా రాముడు అందరివాడు" మూవీ మంచి విజయం సాధించాలని ఆయన తన శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ – ఈ రోజు "మా రాముడు అందరివాడు" సినిమా నుంచి 'ఇడిసెల్లిపోయావా..' సాంగ్ లాంఛ్ చేయడం సంతోషంగా ఉంది. ఈ పాటను డైరెక్టర్ యద్ధనపూడి మైఖేల్ మంచి సాహిత్యంతో రాశారు. నల్లగొండ గద్దర్ నర్సారెడ్డి అన్న బ్రహ్మాండంగా పాడారు. ఇది చాలా మంచి సినిమా. సమాజానికి దిక్సూచిగా నిలిచే సందేశంతో మిమ్మల్ని అలరించే వినోదంతో ఈ సినిమాను తెరకెక్కించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులు ఈ సినిమాను చూసి ఆదరించాలి. అలాగే ఇలాంటి కొత్త టాలెంట్ ను మీరంతా ప్రోత్సహించాలని కోరుకుంటున్నా. అన్నారు. తమ సినిమా నుంచి 'ఇడిసెల్లిపోయావా..' సాంగ్ లాంఛ్ చేసి, తమ మూవీకి సపోర్ట్ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి హీరో శ్రీరామ్, నిర్మాత అనుముల లక్ష్మణరావు, డైరెక్టర్ యద్ధనపూడి మైఖేల్ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే "మా రాముడు అందరివాడు" చిత్రాన్ని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తామని వారు తెలియజేశారు.




భగత్ సింగ్ స్మారక యువజన ఉత్సవాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 15 వ తేదీన జరగబోయే 2 కె రన్ పోస్టర్ ని ఆవిష్కరిస్తున్న అడిషనల్ డిసిపి జె.నరసయ్య. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, అశోక రెడ్డి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావిద్ తదితరులు.

## మాజీ డీజీపీ హెచ్ జె దొర మృతిపట్ల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంతాపం

సికింద్రాబాద్, మార్చ్ 13 వాయిస్ టుడే ప్రతినిధి: మాజీ డీజీపీ హెచ్ జె దొర మరణ వార్త తెలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో డీజీపీగా వారు చేసిన సేవలు, శాంతిభద్రతలను కాపాడటంలో నీతి, నిజాయితీ, నిబద్ధత, పరిపాలనా సామర్థ్యం ఎప్పటికీ గుర్తుండి పోతాయన్నారు. జాతీయ స్థాయిలో కేంద్రంలోనూ సిఐఎస్ఎఫ్ డైరెక్టర్‌గా వారు సేవలందించారు. ప్రత్యేకంగా పుట్టపర్తిలో సత్య సాయిబాబా ఆశ్రమానికి దొర చేసిన సేవలు చిరస్మరణీయం. రిటైర్మెంట్ అనంతరం కూడా పోలీసు వ్యవస్థలో సంస్కరణలకోసం వారు సేవలందించారన్నారు. హెచ్ జె దొర మృతి పోలీస్ రంగానికి తీరనిలోటు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, దొర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.



## సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

### ఆర్టీసి యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందించిన జెఎసి

సికింద్రాబాద్, మార్చ్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రభుత్వ అధికారులు, ఆర్టీసీ యాజమాన్యం స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె దిగుతామని తెలంగాణ ఆర్టీసీ జేఏసీ నాయకులు ఆర్టీసీ యాజమాన్యానికి, లేబర్ కమిషనర్ కు శుక్రవారం సమ్మె నోటీసులు అందించారు. ఆర్టీసి కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసి యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఎన్ని మెమోరాండమ్ లు సమర్పించినా స్పందన లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో సమ్మె నోటీస్ ఇవ్వాల్సి వచ్చిందని ఆర్టీసి జెఎసి నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్టీసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కో కన్వీనర్ కె.యాదయ్య, కో కన్వీనర్ ఎస్.సురేష్, బి.యాదగిరి లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2017 వేతన సవరణ ఇచ్చారని, కాని ఆ వేతన సవరణకు సంబంధించిన ఎరియర్స్ నేటివరకు చెల్లింపు కాలేదన్నారు. ఆ వేతన సవరణలో జరగాల్సిన అలవెన్స్ లు, ఫ్రింజ్ బెనిఫిట్స్ పెంచకపోవడం చాలా విచారకరమన్నారు. పాత అలవెన్స్ లే ఇవ్వటం వలన ఆర్టీసి కార్మికులకు ఆర్థిక నష్టం జరిగిందన్నారు. 2017 లో రిటైరైన కార్మికులకు ఫిక్సేషన్లు జరిగినా, నేటివరకు వారికి సెటిల్మెంట్స్ చేయలేదని తెలిపారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్మెంట్ తో ఆర్టీసి కార్మికులకు అందజేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఆయన ముఖ్యమంత్రి అయి రెండున్నర సంవత్సరాలు గడిచినా విలీన ప్రక్రియ నేటివరకు మొదలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నేటివరకు నెరవేరకపోవడంతో కార్మికులలో అసంతృప్తి నెలకొందని అన్నారు. విధినిర్వహణలో ఆర్టీసి ఉద్యోగి చనిపోతే బ్రెడ్ విన్నర్ స్కీమ్ కింద ఆ కుటుంబంలో అర్హులైన ఒకరికి ఉద్యోగం ఇస్తారు కాని ఆర్టీసిలో ఇచ్చే ఉద్యోగం రెగ్యులర్ ప్రాతిపదికన కాకుండా కన్సాలిడేటెడ్ బేసిస్ లో కారుణ్య నియామకాలు చేపట్టడం అత్యంత దురదృష్టకరమన్నారు. కాబట్టి సింగరేణి, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆర్టిసి లో బ్రెడ్ విన్నర్ స్కీమ్ కింద చేసే నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదికన ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. 2019 నుండి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసిలో ట్రేడ్ యూనియన్లను నిర్వీర్యం చేసిందని, దానివలన ఆర్టీసి కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఎక్కువయ్యాయని, అధికారులు పనిభారాలను పెంచి కార్మికుల నడ్డి విరుస్తున్నారని ఆయన విమర్శించారు. ఆర్టీసిలో ట్రేడ్ యూనియన్లను రెస్టోర్ చేస్తూ, చట్ట ప్రకారం నిర్వహించాల్సిన ఎన్నికలు జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తక్షణమే అధికారులు స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున సమ్మెకు దిగుతామని, సిద్ధం సిద్ధం సమక్షం అంటూ ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## పరిశోధనా సంస్థలు - పరిశ్రమల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది

**ఎంఎస్ఎంఈలకు సాంకేతికత బదిలీకి ఐఐసీటీ కట్టుబడి ఉంది: డా. శ్రీనివాసరెడ్డి**

**ఎంఎస్ఎంఈ లకు కొత్త సాంకేతిక అవకాశాలు...**



సికింద్రాబాద్, మార్చి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సాంకేతికంగా అభివృద్ధి చెందేందుకు పరిశోధనా సంస్థలు--పరిశ్రమల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సీఎస్ఐఆర్--ఐఐసీటీ డైరెక్టర్ డా. డి. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సీఎస్ఐఆర్ -- ఐఐసీటీ, లఘు ఉద్యోగ భారతి సంయుక్తంగా శుక్రవారం తార్నాక లో నిర్వహించిన ఇండస్ట్రీ ఇంటరాక్షన్ మీట్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశోధనలను పరిశ్రమలకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాలుగా మార్చేందుకు సంస్థ కట్టుబడి ఉందని ఆయన అన్నారు. హైడ్రజైన్ హైడ్రేట్ ప్రాసెస్ టెక్నాలజీ వంటి స్వదేశీ సాంకేతికతలను అభివృద్ధి చేసి దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదనంగా ఏపీఐ తయారీ విధానాలు, ప్రత్యేక రసాయనాల కోసం కాటలిటిక్ టెక్నాలజీలు, వ్యర్థాలను ఇంధనంగా మార్చే బయోమెథనేషన్ సాంకేతికతలను కూడా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. పరిశోధనా సంస్థలు మరియు ఎంఎస్ఎంఈ పరిశ్రమల మధ్య భాగస్వామ్యం పెరగడం ద్వారా ఆవిష్కరణలు వేగవంతం కావడంతో పాటు దేశీయ తయారీ రంగం బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ లైసెన్సింగ్, పైలట్ స్థాయి ధ్రువీకరణ, పరిశ్రమలతో సంయుక్త పరిశోధనల ద్వారా ఎంఎస్ఎంఈలు స్థిరమైన తయారీ విధానాలను అనుసరించేందుకు ఐఐసీటీ మద్దతు అందిస్తోందని తెలిపారు. అనంతరం సమావేశంలో ఐఐసీటీ శాస్త్రవేత్తలు పరిశ్రమల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే సాంకేతికతలు, పరిశోధన కార్యక్రమాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో లఘు ఉద్యోగ్ భారతీ ఆల్ ఇండియా వర్కింగ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి. అనిల్ కుమార్, సీఎస్ఐఆర్--ఐఐసీటీ బీడీఆర్ఎం చైర్, సైంటిస్ట్-జీ డా. ప్రవీణ్ ఆర్. లిఖర్ తదితరులు పాల్గొన్నారు.




## డిజిటల్ విద్యపై ఓయూ ఈఎంఆర్సీ చొరవ అభినందనీయం

**ఓయూ యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ లావణ్య...**

**డిజిటల్ ఉన్నత విద్యపై ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు**

సికింద్రాబాద్, మార్చి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీలోని ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసెర్చ్ సెంటర్ (ఈఎంఆర్సీ) వేదికగా "ఉన్నత విద్య పునర్నిర్మాణం: వికసిత్ భారత్ 2047 దిశగా డిజిటల్ మార్గాలు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ముగిసింది. కన్సార్షియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ న్యూఢిల్లీ తో కలిసి రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సులో దాదాపు ఎనిమిది రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. 2047 నాటికి భారతదేశాన్ని జ్ఞాన ఆధారిత సూపర్ పవర్‌గా మార్చాలనే జాతీయ దార్శనికతకు అనుగుణంగా ఆయా అంశాల్లో నిష్ణాతులైన అధ్యాపకులు పాల్గొని మాట్లాడారు. డిజిటల్ విద్య, కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిత, నూతన విద్యా సాంకేతికత, జాతీయ విద్యావిధానం సహా డిజిటల్ ఆధారిత ఉన్నత విద్యపై దేశంలోని పలు ప్రాంతాల నుంచి పరిశోధకులు 63 పరిశోధక పత్రాలు సమర్పించారు. ప్రొఫెసర్ టి.టి శ్రీకుమార్, ప్రొఫెసర్ రాజారాం, డాక్టర్ సతీష్, డాక్టర్ రామకృష్ణ కంచ లు పరిశోధక సెషన్లకు అధ్యక్షత వహించారు. డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, ప్రొఫెసర్ మోయిజ్, ప్రొఫెసర్ వై రామకృష్ణ, ప్రొఫెసర్ ప్యాట్రిక్ లు ఏఐ ఆధారిత ఉన్నత విద్య, ట్రాన్స్ఫర్మిగ్ అడ్మినిస్ట్రేషన్, మూక్స్ లో డాటా అనలిటిక్స్, మూక్స్ రూపకల్పన, ఏఐ ఆధారిత ఉన్నత విద్య, వికసిత్ భారత్ 2047 రూపకల్పనలో ఏఐ భాగస్వామ్యం తదితర అంశాలపై వివరించారు. శుక్రవారం జరిగిన ఈ సదస్సు

ముగింపు సభకు ముఖ్య అతిథిగా ఓయూ యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ లావణ్య హాజరై మాట్లాడారు. డిజిటల్ విద్యపై ఓయూ ఈఎంఆర్సీ చొరవ అభినందనీయమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రపంచంలో విద్యారంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను, కృత్రిమ మేధను అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అందిపుచ్చుకోవటం అనివార్యమని స్పష్టం చేశారు. గౌరవ అతిథిగా హైజరైన ఇఫ్లూ ప్రొఫెసర్ టి.టి శ్రీకుమార్.... డిజిటల్ విద్య, ఆధునిక సాంకేతితను విద్యారంగంలో ఎలా వినియోగించుకోవాలో వివరించారు. సీఈసీ, న్యూఢిల్లీ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ శత్రుధ మాట్లాడుతూ..... దేశ వ్యాప్తంగా ఉన్న ఈఎంఆర్సీల తో కలిసి డిజిటల్ విద్యపై ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఓయూ ఈఎంఆర్సీ డైరెక్టర్ పి.రఘుపతి కృతజ్ఞతలు తెలిపారు.

# దేశ నిర్మాణంలో యువ మేనేజ్‌మెంట్ పాత్ర కీలకం

## నిపుణుల తీర్చిదిద్దే వేదికగా బ్లిట్జ్‌క్రిగ్-2కే26...

## ఉస్మానియాలో మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో విద్యార్థుల సందడి..

సికింద్రాబాద్, మార్చి 12 (వాయిస్ టుడే ప్రతినిధి): నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, దేశ నిర్మాణం లో యువ మేనేజ్‌మెంట్ నిపుణుల పాత్ర అత్యంత కీల కమని ఈసీఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనే ష్ కుమార్ శర్మ పేర్కొ న్నారు. ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న రెండు రోజుల మేనేజ్‌మెంట్ ఫెస్ట్ "బ్లిట్జ్‌క్రిగ్-2కే26"ను శుక్రవారం ఘనంగా ప్రారంభ మైం ది..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూఇలాంటి మేనేజ్‌మెంట్ఉత్సవాలు విద్యా ర్థుల్లో నాయకత్వ



నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, కార్పొరేట్ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే ధైర్యం,ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయని అన్నారు. అలాగే సాంకేతిక మార్పులకు అనుగు ణంగా ఆలోచన విధానాన్ని మార్చుకుని, సృజనాత్మకతతోముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభ వాన్ని అందించడంతో పాటు,టీమ్‌వర్క్, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందించడంలో తోడ్పడతాయని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా పద్మావతి కన్స్ట్రక్షన్స్ ప్రతినిధి వేదాంతం సుబ్బారావు,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా సికింద్రాబాద్ డీజీఎం భాస్కర్ తమ పరిశ్రమల అనుభ వా లను విద్యా ర్థు లతో పంచుకున్నారు. యువతలో ఔత్సాహిక వ్యాపార దృక్పథం పెంపొందిం చుకుని స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. ఫెస్ట్‌ భాగంగా వివిధ మేనేజ్ మెంట్ గేమ్స్,వ్యాపార ప్రణాళిక పోటీలు, గ్రూప్ చర్చలు ,ప్రెజెంటేషన్లు , సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ సీనియర్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు, విభాగాధిపతి ప్రొఫెసర్ వై.జహంగీర్,అధ్యాపకులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బీసీలు అనగదొక్కబడుతున్నారు

### గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.వి కృష్ణారావు

ఖమ్మం, మార్చి 13 ( వాయిస్ టుడే) : ఖమ్మం నగరంలో శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిని మధు గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.వి కృష్ణారావు హాజరై మాట్లాడారు . సమాజంలో బీసీలు అనగ దొక్కబడుతున్నారని ఇప్పటికైనా మేల్కొని బీసీలు అంతా ఐక్యమై రాజ్యాధికార దిశగా ప్రయాణించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లేషన్ సభలో ఇచ్చిన హామీ అయిన బీసీ 42% రిజర్వేషన్ ను వెంటనే అమలు చేసి షెడ్యూల్ నైన్ (9) లో పొందుపరిచి చట్టబద్రత కల్పించాలని అలాగే బీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ ను ఏర్పాటు చేసి సామాజిక , ఆర్థిక , రాజకీయ , విద్య , వైద్య మరియు ఉద్యోగ రంగాలలో బీసీ అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పడి బీసీ బిడ్డలకు ముందు తరాల భవిష్యత్తును అందించాలని కోరారు . అలాగే మార్చ్ 15న జరిగే ఫీజు పోరు దీక్ష ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు . సత్తుపల్లి నియోజకవర్గం అధ్యక్షులు మారుతి ఆధ్వర్యంలో 5 మండలాల అధ్యక్షులు నియమించడం జరిగింది . ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్వర చారి , రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు యాదవ్ , జిల్లా గౌరవ సలహాదారులు పద్మాచారి , జిల్లా ఉపాధ్యక్షులు మక్కల వెంకన్న , యువజన విభాగం జిల్లా అధ్యక్షులు రాసాల సతీష్ యాదవ్ , ప్రధాన కార్యదర్శి చిన్నం శెట్టి వెంకట రామకృష్ణ , కోశాధికారి గునిగంటి వీరన్న , జిల్లా కార్యదర్శి కుందారపు సుధాకర్ , ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పుల్లూరు వెంకన్న బాబు , సత్తుపల్లి కాంసెన్సీ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు . కొండలరావు సత్తుపల్లి మండలం , మణికంఠ వేంసూరు మండలం , శీను పెనుబల్లి మండలం , మురళి కల్లూరు మండలం , శ్రీనివాసరావు తల్లాడ మండలం వారిగా ఎన్నుకున్నారు.



## నిరుపేదలకు అండగా 'లైఫ్ లైన్ ఫౌండేషన్'

### రంజాన్ రేషన్ కిట్ల పంపిణీ

ఖమ్మం, మార్చి 13 (వాయిస్ టుడే) పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని నిరుపేద కుటుంబాలకు లైఫ్ లైన్ ఫౌండేషన్ తమ ఉదారతను చాటుకుంది. నగరంలోని 14వ డివిజన్ పరిధిలో ఉన్న గొల్లగూడెం మరియు రాజన్నపేట కాలనీలలో నివసిస్తున్న నిరుపేదలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జానీమియా మాట్లాడుతూ, పండుగ వేళ ఏ పేదవాడు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో తమ సంస్థ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వాలంటీర్లు షేక్ నజీరుద్దీన్, షేక్ గౌస్ మియా, షేక్ నజీర్, షేక్ కన్నం సాహెబ్, షేక్ చిన్న జానీ మియా, షేక్ షరీఫ్, ఇమామ్, మదర్ సాహెబ్, జానిమియా తదితరులు పాల్గొని పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. తమకు రేషన్ కిట్లు అందజేసినందుకు కాలనీ వాసులు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



## కార్మికులు ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలి

### ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్

రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 13 (వాయిస్ టుడే) మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్, ఆధ్వర్యం లో వెంకట్రావు నగర్ లోని కార్మికుల కోసం మనోవికాస సదస్సును ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ శుక్రవారం నిర్వహించి కార్మికులకు ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. రోజు వారీ జీవితంలో సరైన జీవన విధాన మార్పులు చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోవచ్చని చెప్పారు. పొగ త్రాగడం, మద్యం సేవించడం వంటి చెడు అలవాట్లను పూర్తిగా వదిలేయాలని, శరీరానికి ఉపయోగపడే మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. సమయానికి భోజనం చేయడం, తగిన నిద్ర, ప్రతి రోజూ కొంతసేపు వ్యాయామం ధ్యానం చేయడం వంటి మంచి అలవాట్లు పెంపొందించు కోవాలని తెలిపారు. లైఫ్ స్టైల్ మేనేజ్‌మెంట్ ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవడం తో పాటు ఆరోగ్య కరమైన జీవితం గడపవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్మికులు ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టడం ద్వారా కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవగలరని అన్నారు. మానసిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ సాధారణ వైద్య శాల లోని మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మైండ్ కేర్ సెంటర్ సిబ్బంది కొండ ఉమ, బూర శ్రీమతి, రాపెల్లి లత, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

### తెలుగు రాష్ట్రాల రైల్వేప్రయాణీకులకు కేంద్రం మరో గుడ్‌న్యూస్

# హైదరాబాద్ నుంచి మరో 3 కొత్త రెగ్యులర్ రైలు సర్వీసులు ప్రారంభం

### హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

### ప్రధాని, రైల్వేశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపిన కిషన్ రెడ్డి...

సికింద్రాబాద్, మార్చ్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): పెరుగుతున్న జనాభా, ఆయా మార్గాలలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా భారతీయ రైల్వే నూతన రైలు సర్వీసులను ప్రారంభిస్తూ ఉంటుంది. అందులో భాగంగా 2014 నుంచి ఇప్పటివరకు గత 12 సంవత్సరాల కాలంలో హైదరాబాద్ కేంద్రంగా భారతీయ రైల్వే 91 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించింది. ఈ రైళ్లన్నీ కూడా జంట నగరాల పరిధిలోని రైల్వేస్టేషన్ల నుంచే (హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి టర్మినల్) ప్రారంభమవుతున్నాయి. కొత్త సర్వీసుల ప్రారంభంతో పాటుగా.. ఇప్పటికే నడుస్తున్న రైలు సర్వీసుల్లో.. పాత కోచ్ లను ఆధునీకరించి ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి కూడా భారతీయ రైల్వే నిరంతరం కృషి చేస్తోంది. ప్రస్తుతం కొన్ని మార్గాలలో ప్రయాణికుల నుంచి వచ్చిన డిమాండ్ కు అనుగుణంగా సేవలు అందిస్తున్న మూడు స్పెషల్ ట్రైన్స్‌ను.. రెగ్యులర్ ట్రైన్స్‌గా మారుస్తూ భారతీయ రైల్వే నిర్ణయం తీసుకుంది. దీనివల్ల రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు మేలు జరగనుంది. భారతీయ రైల్వే తీసుకున్న నిర్ణయంలో భాగంగా.. రైలు నం. 07191/07192 కాచిగూడ–మధురై–కాచిగూడ రైలును రైలు నం. 17165/17616 కాచిగూడ–ట్యుటికోరిన్–కాచిగూడ ఎక్స్ ప్రెస్ గా మార్చారు. ఇకపై ఈ రైలు ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కాచిగూడలో మొదలై మరుసటి రోజు మంగళవారం రాత్రి 10:45 గం.లకు కేరళ రాష్ట్రంలోని ట్యూటికోరిన్ కు చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో ట్యూటికోరిన్ నుంచి బుధవారం ఉదయం 7:45 గంటలకు మొదలై మరుసటిరోజు మధ్యాహ్నం 1:25 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న



షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె రోడ్, పీలేరు, పాకాల, చిత్తూరు స్టేషన్ల మీదుగా ప్రయాణం సాగిస్తుంది.

రైలు నం. 07230/07229 హైదరాబాద్–కన్యాకుమారి–హైదరాబాద్ రైలును రైలు నం. 17069/17070 హైదరాబాద్–కన్యాకుమారి–హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ గా మార్చారు. ఈ రైలు గతంలోలాగే ప్రతి బుధవారం సాయంత్రం 5:20 గంటలకు హైదరాబాద్ లో బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటలకు తమిళనాడులోని కన్యాకుమారి చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో కూడా గతంలో లాగే ప్రతి శుక్రవారం తెల్లవారుజామున 5:15 గంటలకు కన్యాకుమారిలో బయలుదేరి శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి జంక్షన్, సత్తెనపల్లి, గుంటూరు జంక్షన్, తెనాలి జంక్షన్, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, రేణిగుంట జంక్షన్, తిరుపతి, పాకాల జంక్షన్, చిత్తూరు స్టేషన్ల మీదుగా ప్రయాణం సాగిస్తుంది.

రైలు నం. 07225/07226 చర్లపల్లి–షాలిమార్–చర్లపల్లి రైలును రైలు నం. 17065/17066 చర్లపల్లి–షాలిమార్–చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ గా మార్చారు. ఇకపై ఈ రైలు ప్రతి మంగళవారం ఉదయం 7:15 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు బుధవారం ఉదయం 11:20 గంటలకు పశ్చిమబెంగాల్ షాలిమార్‌కు చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో బుధవారం మధ్యాహ్నం 12:50 గం. లకు షాలిమార్ లో బయలుదేరి మరుసటి రోజు గురువారం సాయంత్రం 7 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న కాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస స్టేషన్ల మీదుగా ప్రయాణం సాగిస్తుంది.

మొత్తంగా 3 స్పెషల్ రైళ్లను రెగ్యులర్ సర్వీసులుగా మారుస్తూ భారతీయ రైల్వే తీసుకున్న నిర్ణయం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి మోదీ కి, రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి చిత్తశుద్ధితో పని చేస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రానికి రూ. 36,286 కోట్ల రైల్వే బడ్జెట్ ను కేటాయించారని, ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 47,984 కోట్ల రైల్వే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, రూ. 2,668 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40 రైల్వేస్టేషన్లను అధునాతన సౌకర్యాలతో అమృత్ భారత్ రైల్వేస్టేషన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్లు తెలియజేశారు. ఇటీవలే దేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా తెలంగాణ రాష్ట్రానికి 3 హైస్పీడ్ రైల్ కారిడార్లను మంజూరు చేశారని, ఈ హైస్పీడ్ రైల్ కారిడార్లు తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థికాభివృద్ధిలో కీలకం కానున్నాయని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 5 వందే భారత్ రైళ్లు, 4 అమృత్ భారత్ రైళ్లు సేవలు అందిస్తున్నాయని, రానున్న రోజులలో మరిన్ని అధునాతన రైళ్లు, రద్దీ ఉన్న మరిన్ని కొత్త మార్గాలకు రైలు సేవలను అందుబాటులోకి తీసుకురావటానికి కృషి చేస్తామని కిషన్ రెడ్డి తెలియజేశారు.



## శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం లో భక్తుల రద్దీ

### భక్తులకు ఆలయ అధికారుల సమగ్ర ఏర్పాట్లు

వేములవాడ, మార్చి 13 (వాయిస్ టుడే) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం లో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారికి భక్తులు కోడె మొక్కులు,అభిషేకాలు, అన్న పూజలు, కుంకుమ పూజలు, నిత్య కళ్యాణం వంటి వివిధ మొక్కులు చెల్లించుకున్నారు.దూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని విధాలుగా సమగ్ర ఏర్పాట్లు చేశారు.

## తెలంగాణ ఉమెన్స్ వాలీబాల్ టీమ్ అసిస్టెంట్ కోచ్;ముద్రకోలా అఖిల ఎంపిక



ఎల్లారెడ్డిపేట, మార్చి 13 (వాయిస్ టుడే) భువనేశ్వర్ లో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల లో పాల్గొన బోయే తెలంగాణ ఉమెన్స్ వాలీబాల్ జట్టు అసిస్టెంట్ కోచ్ గా గ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి కి చెందిన సీనియర్ వాలీబాల్ ప్లేయర్ ఎంపికయ్యారు, ఫిబ్రవరి 16 నుండి 20 వరకు వేములవాడ పట్టణ కేంద్రం లో జరిగినటు వంటి తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడా కారులకు మార్చు 2 నుండి 12 వరకు జరిగిన ప్రత్యేక శిక్షణ శిబిరం లో పాల్గొన్న అఖిల తెలంగాణ ఉమెన్స్ జట్టును భువనేశ్వర్ లో ఈనెల 14 నుండి 20 తారీకు వరకు జరగబోయే జాతీయస్థాయి ఆటలలో పాల్గొనేం దుకు మార్చి 13 నాడు ప్రయాణమై వెళ్లారు. తమ గ్రామ క్రీడాకారిణి రాష్ట్ర జట్టుకు అసిస్టెంట్ కోచ్ గా ఎంపిక అయినందుకు మండల నాయకులు ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

## శ్రీ వారి సేవలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



వేములవాడ, మార్చి 13 (వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ఇందిరమ్మ రాజ్యం లో ప్రజలంతా పడి పంటల తో సుఖ సంతోషాల తో ఉండాలని,ప్రజా ప్రభుత్వం లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి, సంక్షేమశీ, నిరంతరాయం గా స్వామి వారి కృపతో జరగాలని కోరుకున్నట్లు తెలియజేశారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలని అ ఏడుకొండల వెంకటేశ్వర స్వామి వారిని వేడుకున్నట్లు మీడియాకు వెల్లడించారు.

## సమాఖ్య గ్రామైక్య సంఘము ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ



గర్శకుర్తి,మార్చి 13(వాయిస్ టుడే): సమాఖ్య గ్రామైక్య సంఘము ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గర్శకుర్తి గ్రామంలోని మార్కండేయ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళల కోసం వివిధ ఆటల పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.పోటీలలో గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మెరుగు ప్రవీణ్ అమ్మపై ఒక హృద్యమైన పాట పాడి సభలోని అందరినీ ఆకట్టుకున్నారు. సందర్భంగా రజాక్ పాషా మరియు మెరుగు ప్రవీణ్ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి మహిళల సాధికారత, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రపై ప్రసంగించారు. అంతేకాకుండా మహిళా సంఘాల ప్రతినిధులు మహిళల ఐక్యత,ఆత్మవిశ్వాసం మరియు ఆర్థిక స్వావలంబనపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిందం ఆంజనేయులు,తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రజాక్ పాషా, అసిస్టెంట్ మేనేజర్ మెరుగు ప్రవీణ్, మహిళా సంఘాల ప్రతినిధులు కొత్తూరి తార,భూత్కూరి దావీద్, కె. జీవన్ కుమార్,కముటం లావణ్య, వేల్పుల జ్యోతి,మిట్టపెల్లి సంధ్య రాణి పాల్గొన్నారు.

## సిరిసిల్ల జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరతలేదు వదంతులు, అసత్య ప్రచారాలు నమ్మవద్దు

### సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ఎనర్జీ మానిటరింగ్ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిలిండర్ల పంపిణీ, స్టాక్ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కమిటీ సభ్యులు, సిలిండర్ ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఎనర్జీ మానిటరింగ్ కమిటీ జిల్లా చైర్మన్ గా కలెక్టర్, కన్వీనర్ గా జిల్లా పౌరసరఫరాల అధికారి, సభ్యులుగా వివిధ శాఖల అధికారులు ఉంటారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో సిలిండర్ల నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని, వదంతులు నమ్మవద్దని సూచించారు. గృహ వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సూచించిన ధరలకు మాత్రమే సిలిండర్లను విక్రయించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ హాస్టళ్లు, స్కూళ్లు, అనాథ శ్రమాలు, ఆస్పత్రులకు ఇబ్బంది లేకుండా సిలిండర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టించవద్దని, బ్లాక్ దందా చేయవద్దని సూచించారు. సిలిండర్ పక్కదారి పట్టినా.. బ్లాక్ దందా చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి రాధాభాయ్, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు రవీందర్ రెడ్డి, అఫ్జల్ బేగం, సౌజన్య, రూపేష్, లక్ష్మీరాజం, రజిత, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా వార్డుల సందర్శన





## - మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

జమ్మికుంట మార్చి 13 (వాయిస్ టుడే): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన పట్టణ ప్రగతి కార్యక్రమం ఈరోజు జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డు లో కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా అవసరాలు ప్రజల మౌలిక వసతులు కల్పన ధ్యేయంగా వార్డులో ప్రతి వీధి లోని గల్లీలు తిరుగుతూ సమస్యలు గుర్తించడం జరిగింది. మరియు నూతన డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాట్లు, సిసి రోడ్లు. మిషన్ భగీరథ పైప్ లైన్లు, నూతన కులాయి కనెక్షన్లు గురించి చర్చించడం మరియు వార్డులో మున్సిపల్ సిబ్బందితో డ్రైనేజీలు క్లియర్ చేయించడం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు. రోడ్లను శుభ్రపరచడం, బ్లీచింగ్ వేయించడం, పైప్ లైన్ మరమ్మతులు చేయించడం. వంటి కార్యక్రమాన్ని ఈరోజు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ (దిలీప్), వైస్ చైర్మన్ జావేద్, ఏఈ వికాస్, సానిటేషన్ ఇన్స్పెక్టర్ మహేష్, సి ఎల్ ఆర్ పి జ్యోతి, ఆర్ పి విజయలక్ష్మి, మాజీ కౌన్సిలర్ పిట్టల శ్వేతా రమేష్, మాజి వార్డు మెంబర్ పిట్టల ఉప్పలయ్య, హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ రోమాల రాజ్ కుమార్, యూత్ నాయకులు ఎదులాపురం రాజేష్, మిర్యాల కార్ రాకేష్, జమీర్, సప్పిడి రాజయ్య, మహిళా నాయకురాలు మిర్యాల కార్ మమత, ముదిగిరి లక్ష్మీ, పోలు సరోజన, సప్పిడి సమ్మక్క మరియు మున్సిపల్ సిబ్బంది వార్డ్ ప్రజలు పాల్గొనడం జరిగింది.



## విశ్వకర్మ యోజన స్కీం లబ్ధిదారులకు టూల్ కిట్స్ పంపిణీ చేసిన మేయర్ కోలగని శ్రీనివాస్

కరీంనగర్,మార్చి 13(వాయిస్ టుడే): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజనలో భాగంగా ట్రైనింగ్ పూర్తయిన వారికి 1500 రూపాయల విలువ గల టూల్ కిట్స్ ను చింతకుంటలో కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ పంపిణీ చేశారు. స్థానిక బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కొలగని శ్రీనివాస్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా దేశంలోని లక్షలాది మంది లబ్ధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని, 18 రకాల వృత్తుల వారికి శిక్షణ సర్టిఫికెట్ మూడు లక్షల వరకు రుణ సదుపాయం ఈ పథకం ద్వారా పొందవచ్చు అన్నారు.ఇలాంటి మంచి పథకాలను అమలుపరుస్తున్న నరేంద్ర మోడీ,కరీంనగర్లో స్కీం అమలు కోసం కృషి చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కి ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.కొత్తపల్లి మండలంలో అత్యధికంగా 1200 మందికి పైగా లబ్ధిదారులు ఈ పథకాన్ని వినియోగించుకునేలా కృషిచేసిన సిఎస్సి సెంటర్ నిర్వాహకులు అనిల్ రాజేశ్వరి లను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యాలయ కార్యదర్శి గుంజేటి శివకుమార్,బిజెపి సీనియర్ నాయకులు సోమిరెడ్డి సత్యనారాయణరెడ్డి,బుల్లి సూరి, దాసరి రవి,అవినాష్,పెరుమాండ్ల సురేష్,లుక్క రాజు ఆదర్శ్ శీను, నరేష్ ,ధీరజ్,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వెంటనే గైనకాలాజిస్ట్ లను నియమించాలి



వేములవాడ, మార్చి 13 (వాయిస్ టుడే) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా హాస్పిటల్ కు 12 వ తేదీన రాత్రి 7 నుండి 7:30 గంటల ప్రాంతం లో రుద్రంగి నుండి గౌతమి అనే గర్భిణీ స్త్రీ ని డెలివరీ నిమిత్తం తీసుకురావడం జరిగింది. ఈ క్రమం లో హాస్పిటల్ లో డాక్టర్ లు లేరని సిరిసిల్ల కైనా, కరీంనగర్ కైనా తీసుకెళ్లాలని చెప్పారని, ప్రభుత్వాలు కోట్ల రూపాయలు పెట్టి నిర్మించిన హాస్పిటల్ లో పేదలకు వైద్యం అందడం లేదని, గతంలో ముగ్గురు గైనకాలాజిస్ట్ లు వున్నారని అన్నారు. ఈరోజు సిరిసిల్ల, కరీంనగర్ కు వెళ్ళమని, డాక్టర్ లు లేరని చెప్పడం జరిగిందని, అంబులెన్సు లో డీజిల్ లేదని చెప్పడం జరిగిందని, వెంటనే డాక్టర్ లను ఏర్పాటు చేసి, డే అండ్ నైట్ పూర్తి స్టాఫ్ ను ఏర్పాటు చేసి మెరుగైన సేవలు అందించేలా చూడాలని వేములవాడ నియోజకవర్గ సిపిఐ పార్టీ ఇంచార్జ్ కడారి రాములు, సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్ లు డిమాండ్ చేశారు. అనంతరం గర్భిణీ స్త్రీ కుటుంబాన్ని కలిసి వివరాలు తెలుసుకున్నారు.




## వరంగల్ నగరం మత సామరస్యానికి ప్రతీక

**ఫాతిమా మాత ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలి..**

**ఫాతిమా ఫీస్ట్ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని..**

కాజీపేట,వాయిస్ టుడే: వరంగల్ నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఫాతిమా నగర్ చర్చి లో నిర్వహించిన ఫాతిమా మాత మహోత్సవ వేడుకల్లో నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు,క్రైస్తవ మత పెద్దలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,మత పెద్దలు,విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ,ముస్లిం,క్రైస్తవ మతాల ప్రజలు పరస్పర గౌరవంతో,ఐక్యతతో జీవించడం వరంగల్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో సోదరభావం,పరస్పర గౌరవాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. ప్రతి సంవత్సరం ఎంతో భక్తి శ్రద్ధలతో కాథలిక్ క్రైస్తవులు నిర్వహించే ఫాతిమా మాత మహోత్సవం ఎంతో ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని,భక్తులందరికీ ఫాతిమా మాత ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మానస రాంప్రసాద్,మాజీ కార్పొరేటర్ అబూబకర్,సీనియర్ నాయకులు ఫ్ పాల్ ఆనంద్,కార్డినల్ పూనా అంతోని,విశ్రాంత బిషప్ జోసెఫ్,పాలనాధికారి ఫాదర్ విజయపాల్,ఫాతిమా చర్చి గురువుకు మర్రెడ్డి స్థానిక క్రైస్తవ మత పెద్దలు,చర్చి కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,విశ్వాసులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విజయోస్తూ..!

**పది ఫలితాలతో మీరంతా మెరవాలి**

**మీ కన్న తల్లిదండ్రులు మురవాలి**

**నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు వెళ్లండి**

**చిన్నారులకు ఆల్ ది బెస్ట్ చెబుతూ బండి సంజయ్ సందేశం.**



కరీంనగర్ మార్చి 13(వాయిస్ టుడే): కన్నవారి కలలను నెరవేర్చేందుకు ఉజ్వల భవిష్యత్తును అందుకునేందుకు పదవ తరగతి విద్యార్థులు ఈనెల 14వ తేదీ నుంచి జరిగే పరీక్షలను మంచిగా రాసి ఉత్తీర్ణులు అవ్వాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష రాయనున్న 5, 17,727 మంది విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. పరీక్ష కేంద్రాలకు సమయానికన్నా అరగంట ముందు కచ్చితంగా వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పరీక్ష రాయనున్న విద్యార్థులందరికీ ముందస్తుగా అభినందనలు తెలిపారు.విద్యార్థులకు చదువుపై ఉన్న ఆసక్తిని దృష్టిలో పెట్టుకొని తాను పదవ తరగతి చదివే పేద విద్యార్థులందరికి దాదాపుగా 20వేల మందికి ఉచితంగా సైకిళ్లను అందించాననే విషయాన్ని గుర్తు చేశారు.దీంతో పాఠశాలకు విద్యార్థులంతా సకాలంలో వెళ్లేందుకు అవకాశం దక్కిందని చెప్పారు. అంతేకాకుండా పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును తాను చెల్లించానని దీంతో వారి తల్లిదండ్రులకు కొంత ఆర్థిక భారం తప్పిందన్నారు.పరీక్షల సమయంలో అనవసరమైన ఆందోళన ఒత్తిడికి గురి కాకూడదని ఇన్నాళ్లు శ్రద్ధతో చదివిన సబ్జెక్టులను పునశ్చరణ చేసుకొని మంచిగా పరీక్ష రాయాలని హితవు పలికారు.గతేడాది పరీక్ష ఫలితాల్లో కరీంనగర్ జిల్లా ఉత్తీర్ణతా పరంగా ఆరో స్థానంలో సిరిసిల్ల జిల్లా ఐదవ స్థానంలో నిలిచిందని,ఈసారి తప్పకుండా ఈ రెండు జిల్లాలు మొదటి,రెండవ స్థానాల్లో నిలిచి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు.మరోవైపు అన్ని జిల్లాల కలెక్టర్లు,అధికారులు పోలీసులు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు రవాణా పరంగా ట్రాఫిక్ పరంగా ఇబ్బంది ఉండకుండా చూడాలని సూచించారు.తాను ఈ నెల 14వ తేదీన చేపడుతున్న కొండగట్టు అంజన్న పాదయాత్ర సమయంలోను ఎక్కడ కూడా విద్యార్థులకు అసౌర్యం కలగకుండా చూసుకుంటామని ఈ దిశగా నాయకుల్ని,కార్యకర్తలను సమాయత్తం చేశామన్నారు.పరీక్ష కేంద్రాలను విద్యార్థులకు తగిన వసతులను కల్పించాలన్నారు.ఎండ తీవ్రత దృష్ట్యా వారికి ఫ్యాన్ల సదుపాయంతో పాటు మంచినీళ్లు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. మరోవైపు విద్యార్థులను తల్లిదండ్రులు క్షేమంగా పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి జాగ్రత్తగా ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు.ప్రతి ఒక్క విద్యార్థి పరీక్ష లో పాసై ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని లిశత శాతం ఫలితాలులిసాధించాలని ఆల్ ది బెస్ట్ చెప్పారు.



## ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

### మొక్కలు చెల్లించుకున్న గ్రామ ప్రజలు

జమ్మికుంట మార్చ్ 13, (వాయిస్ టుడే): జమ్మికుంట మండలం లోని పెద్దంపల్లె గ్రామంలో శుక్రవారం రోజు గ్రామ సర్పంచ్ ఏగీత పద్మ కుమార్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా పోచమ్మ బోనాల పండుగ వేడుకలు జరిగాయి. ఈ బోనాల ఉత్సవంలో గ్రామస్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు కొత్త కుండలను పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించి, భక్తిశ్రద్ధలతో వండిన నైవేద్యాన్ని (బోనం) తలపై మోస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారూ. శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలో కోలాహలం నెలకొంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ, బద్ది పోచమ్మ తల్లులను దర్శించుకుని, గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎగిత పద్మ కుమార్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి శక్తి కవితకే ఉంది

**తెలంగాణలో ప్రతిపక్షం పాలక పక్షంతో ఒకటే**

**వెలుగుమట్ల బాధితులకు న్యాయం ఘనత కవితదే.**

**కరీంనగర్ లో ఘనంగా కవిత జన్మదిన వేడుకలు.**

**తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్.**

కరీంనగర్,మార్చి 13(వాయిస్ టుడే): నగరంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినం వేడుకలలో ఘనంగా జరిగాయి.బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు రమేష్ ఆద్వర్యంలో పేదలకు అల్పాహారం వితరణతోపాటుజిల్లా సీనియర్ నాయకుడు రంగరవేణి లక్ష్మణ్ ఆద్వర్యంలో స్థానిక తెలంగాణ చౌక్ లో కేక్ కటింగ్ మరియు స్వీట్స్ పంపిణీ చేశారు. జిల్లా మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి ఆద్వర్యంలో బిట్ వద్ద గల వృద్ధుల ఆశ్రమంలో పండ్ల పంపిణీ కార్యక్రమంతో పాటు.జిల్లా సీనియర్ నాయకుడు బసవేణి రాజేందర్ ఆద్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ కార్యక్రమం ఎర్పాటు చేయడం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా నాయకులు గుండేటి తిరుపతి ఆద్వర్యంలో స్పదంన వృద్ధుల అనాథ ఆశ్రమంలో అన్నధనం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ సామాజిక తెలంగాణ లక్ష్యంగా,బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడి కొట్లాడుతున్న కవిత జన్మదిన వేడుకలను ప్రజల మధ్యలో జరుపుకోవడం చాలా సంతోషకరమైన విషయం కవిత ఉన్నతమైన శిఖరాలకు ఎదిగి పేద ప్రజలకు బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవలు చెయ్యాలని భగవంతుడు వారికి అటువంటి శక్తిని ప్రసాదించాలని కోరారు.ఈ రాష్ట్రంలో ప్రతిపక్షం పాలక వర్గం రెండు ఒకటై పరిపాలన చేస్తున్నాయి అందుకే వెలుగుమట్లలో కాంగ్రెస్ బిఆర్ఎస్ ఒకటే విధంగా అలోచనతో ఉన్నాయని చెప్పడానికి వెలుగుమట్ల బాధితుల కోసం వారు ఒక్క మాట కుడా మాట్లాడలేదు కానీ కవిత వారితో కలిసి చేసిన ఉద్యమ ఫలితం వారిని ప్రభుత్వం గుర్తించిందని వారు అన్నారు.కవిత ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాగృతి నాయకులు చంటి శ్రీనివాస్,గాలిపల్లి రత్నాకర్ చారి, జంగ అపర్ణ, పిన్నింటి సంగీత రెడ్డి, గర్శకుర్తి విద్యాసాగర్,ఎండీ సల్మ, పోన్నం శిరిష, అంజలి,పుసాల పవన్,లంక మనోజ్, మహమ్మద్ హుస్సేన్,ఎండీ యాకుబ్, రంగరవేణి అకాష్, హుస్నాబాద్ రాజ్ కుమార్,నవ్య పాల్గొన్నారు.



## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్**

**డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు**

కరీంనగర్,మార్చి 13(వాయిస్ టుడే): యువత చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని,క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ,ఐక్యత పెంపొందుతాయని జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి మొత్తం 18 జట్లు ఈ పోటీల్లో పాల్గొని ఉత్సాహంగా పోటీపడ్డాయి.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో దాగి ఉన్న ప్రతిభ బయటపడుతుందని,క్రీడలు యువతను చెడు అలవాట్ల నుండి దూరంగా ఉంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. రోజంతా ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో జట్లు అద్భుతంగా ప్రదర్శన కనబర్చాయి.ఫైనల్ మ్యాచ్లో రాంనగర్ జట్టు విజేతగా నిలవగా, గంగాధర జట్టు రన్నర్స్గా నిలిచింది. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను డా బండారి రాజ్కుమార్ మరియు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.యువత క్రీడలు,సామాజిక కార్యక్రమాల వైపు మళ్లి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. సమాజంలో డ్రగ్స్,గంజాయి నిర్మూలన కోసం డివైఎఫ్ఐ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్,సహాయ కార్యదర్శి అరవింద్, నాయకులు విజయ్, అజేయ్, సీను, మహేష్, కేతన్,అర్జున్,క్రీడాకారులు మరియు యువత పాల్గొన్నారు.

## అంజన్న ఆశీర్వాద యాత్ర కు తరలిరండి

**కొండగట్టు వరకు పాదయాత్ర**

**తిమ్మాపూర్ బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి**



తిమ్మాపూర్,మార్చి13(వాయిస్ టుడే): కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ కుమార్ తలపెట్టిన అంజన్న ఆశీర్వాద యాత్రకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి సమావేశంలో కోరారు.ఇటీవల జరిగిన కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకొని మేయర్,డిప్యూటీ మేయర్ స్థానాలను కైవసం చేసుకున్న సందర్భంగా కొండగట్టు అంజన్నకు మొక్కులు అప్పజేప్పే క్రమంలో ఈ పాదయాత్రను తలపెట్టినట్లు పేర్కొన్నారు.కరీంనగర్ కార్పొరేషన్ పై మొదటిసారి కాషాయపు జెండా ఎగిరేలా సహకరించిన అంజన్న భక్తులకు,హిందుత్వ వాదులకు సేవచేసే భాగ్యం కల్పించిన ఆ కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండేలా ఈ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రలో పాల్గొనేవారంతా శనివారం ఉదయం 6:30 గం.లకు కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం వద్దకు చేరుకొని,అల్పాహారం ముగించుకొని బండి సంజయ్ తో పాదయాత్రలో పాల్గొనాలని సూచించారు.హనుమాన్ భక్తులు, హిందుత్వ వాదులు,ధర్మాన్ని నమ్ముకున్నవారు,బీజేపీ కార్యకర్తలు తదితర వర్గాల ప్రజలంతా తప్పకుండా హాజరై ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
శనివారం 14 మార్చి 2026



## రాజనాల శ్రీహరి చేతులమీదుగా JB ఉగాది పురస్కారాల గోడపత్రిక ఆవిష్కరణ

**JB కల్చరల్ ఆర్ట్ సొసైటీ వారి 2026 ఉగాది పురస్కారాల కరపత్ర ఆవిష్కరణ**

వరంగల్ ( వాయిస్ టుడే ) మార్చి 13 : ఈనెల 15న ఆదివారం హనుమకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో జేబీ కల్చర్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిద కార్యక్రమలకు సంబందించిన ఉగాది పురస్కార కార్యక్రమ కరపత్రం ఆవిష్కరణ శుక్రవారం గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా జేబి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కళాకారులను, వివిధ రంగాల్లో విశిష్ట సేవలను అందిస్తున్న వ్యక్తులను గుర్తించి పురస్కారాలు అందజేస్తూ ప్రోత్సహిస్తున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జడల శివని అయన అభినందించారు.

ఆదివారం ఉదయం ప్రారంభమయ్యే వివిధ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఉదయం కవితలు చిత్రలేఖనం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు, అదే రోజు సాయంత్రం 6 గంటలకు సకల కళల జాతర - 2026, సాంస్కృతిక కార్యక్రమాలు, "ఉగాది పురస్కారాలు" అందజేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జడల శివ తెలిపారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా అందరూ పాల్గొనవచ్చునని ఈ సందర్బంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిమల్లె కుమారస్వామి, బొల్లం మధు, సోల విజయ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.



## మొల్లమాంబ జయంతి వేడుకలను తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

**- శాలివాహన సంఘం అధ్యక్ష కార్యదర్శులు, ఆవునూరి రవి, కందికొండ మోహన్**

**- రంగశాయిపేట శాలివాహన సంఘం భవనంలో ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు**

వరంగల్ ( వాయిస్ టుడే) మార్చి 13 : తొలి మహిళా కవయిత్రి, కుమ్మరి మహిళా ఆణిముత్యం మొల్లమాంబ 586 వ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శ్రీ శాలివాహన కుమ్మరి డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆవునూరి రవి, కందికొండ మోహన్ డిమాండ్ చేశారు. కవయిత్రి మొల్లమాంబ 586వ జయంతి వేడుకలను శుక్రవారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో రంగశాయిపేటలోని శాలివాహన సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ శతాబ్దానికి చెందిన కుమ్మరి ముద్దుబిడ్డ తొలి మహిళా కవయిత్రి మొల్ల రామాయణాన్ని రచించిన మొల్ల మాంబ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. మొల్లమాంబ తెలుగుజాతి గర్వించదగ్గ రచయిత్రి అని, ఆది కవయిత్రి మొల్ల అని కీర్తించారు. సంస్కృతంలోని వాల్మీకి రామాయణాన్ని తెలుగు భాషలోకి అనువదించారన్నారు. మొల్ల రచించిన ఆ రామాయణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతి గాంచిందన్నారు. మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో మొల్లమాంబ జయంతి వేడుకలను అధికారుల లాంచనాలతో రాష్ట్ర పండుగగా నిర్వహించడం చాలా గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కుమారస్వామి ఉపాధ్యక్షుడు గడ్డం కుమారస్వామి ఆవునూరి దేవేందర్, రమేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన కాంగ్రెస్ నాయకులు

వరంగల్ ( వాయిస్ టుడే ) మార్చి 13 : వరంగల్ తూర్పు 35 డివిజన్ కి చెందిన గౌసియ అనే మహిళ అనారోగ్యం గురువారం మరణించగా విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్ కొండ దంపతుల ఆదేశాల మేర వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం చేయడం జరిగింది ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి మున్ముందు కూడా వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ నాయకులు ,పగడాల సతీష్,అక్షిత్ పటేల్,బండి నరేందర్, ప్రియదర్శిని, ముంతాజ్,శ్రీలత,లత, బలరామ్ లు పాల్గొన్నారు.

# కరీంనగర్ కాషాయ మయం

**కరీంనగర్ నుండి కొండగట్టుదాకా "అంజన్న ఆశీర్వాద యాత్ర"**

**అంజన్నకు మొక్కులు చెల్లించేందుకు సంజయన్న పాదయాత్ర**

**బండి సంజయ్‌తో కలిసి పాదయాత్ర చేయనున్న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ప్రజాప్రతినిధులు**

**అంజన్న ఆశీర్వాద యాత్రలో పాల్గొనేందుకు భారీ ఎత్తున తరలిరానున్న కాషాయ దళం**

**టెన్త్ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పోలీసులకు సహకరించాలని కోరిన కేంద్ర మంత్రి**

**8 గంటల్లో 40 కి.మీల పాదయాత్ర చేసి అంజన్నకు మొక్కులు చెల్లించుకోనున్న బండి సంజయ్**

**అంజన్న ఆశీర్వాద యాత్రను స్వాగతిస్తున్న భారీ ఎత్తున వెలిసిన ఫ్లెక్సీలు**

**మండుటెండలో దారి పొడవునా మజ్జిగ,మంచినీటి ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్న స్వచ్ఛంద సంస్థలు**

కరీంనగర్,మార్చి 13(వాయిస్ టుడే): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఉదయం ప్రారంభించే "అంజన్న ఆశీర్వాద యాత్ర" లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని భారతీయ జనతా పార్టీ పక్షాన నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు,కౌన్సిలర్లు,కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్ సహా ఆ పార్టీ ప్రజాప్రతినిధులంతా పాల్గొననున్నారు.ఉదయం 7 గంటలకు వీరంతా కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం వద్దకు చేరుకుంటారు.బీజేపీ పక్షాన కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా ఎన్నికైన బీజేపీ సర్పంచులు 108 మంది,450 మంది వార్డు సభ్యులు,54 మంది కార్పొరేటర్లు,కౌన్సిలర్లు ఉన్నారు. వీరంతా బండి సంజయ్ తో కలిసి అడుగులో అడుగు వేసుకుంటూ పాదయాత్ర చేసేందుకు సిద్ధమవుతున్నారు.మరోవైపు వేలాది మంది కాషాయ కర్తలు,భక్తమండళ్లు, స్వచ్ఛంద సంస్థలు,హనుమాన్ భక్తులు భారీ ఎత్తున బండి సంజయ్ తో కలిసి కరీంనగర్ నుండి కొండగట్టు వరకు పాదయాత్ర చేసేందుకు సమాయత్తమవుతున్నారు. బీజేపీ పోలింగ్ బూత్ సభ్యుల నుండి పార్టీ రాష్ట్ర నాయకుల వరకు ప్రతి ఒక్కరూ ఈ పాదయాత్రలో పాల్గొంటున్నారు. మరోవైపు అంజన్న ఆశీర్వాద యాత్ర నేపథ్యంలో కరీంనగర్ అంతా కాషాయ మయమైంది.బండి సంజయ్ చేపట్టిన 'అంజన్న ఆశీర్వాద యాత్ర"కు వచ్చే వారికి స్వాగతం పలుకుతూ భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.పెద్ద ఎత్తున అలంకరణ చేస్తున్నారు.మరోవైపు ఎండాకాలం ప్రారంభం కావడం కరీంనగర్ లో రేపు 37 నుండి 40 డిగ్రీల సెల్సియస్ మేరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో పాదయాత్రలో పాల్గొనే వారికి అవసరమైన మంచి నీళ్లు,మజ్జిగ వంటి పానియాలను దారి పొడవునా అందుబాటులో ఉంచేందుకు బీజేపీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. వీరితోపాటు స్వచ్ఛంద సంస్థలు, భక్తమండళ్ల నిర్వాహకులు సైతం స్వచ్ఛందంగా ఈ పాదయాత్రలో పాల్గొనే వారికి పులిహోర,మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో నిమగ్నమై ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ "అంజన్న ఆశీర్వాద యాత్ర"లో పాల్గొనేందుకు ఢిల్లీ నుండి బయలుదేరి అర్ధరాత్రి సమాయానికి కరీంనగర్ చేరుకుంటారు.శనివారం ఉదయం 6 గంటలకు కరీంనగర్ మహాశక్తి ఆలయం వద్దకు వెళతారు. అక్కడ అమ్మవారిని దర్శించుకుంటారు.మహాశక్తి ఆలయ ప్రాంగణం నుండే పాదయాత్ర ప్రారంభం కానుండటంతో బీజేపీ ప్రజాప్రతినిధులు,కాషాయ శ్రేణులు, భక్తమండళ్ల ప్రతినిధులంతా పొద్దున్నే అక్కడికే చేరుకుంటారు.వారితో కలిసి సరిగ్గా 7 గంటలకు బండి సంజయ్ "అంజన్న ఆశీర్వాద యాత్ర"ను ప్రారంభిస్తారు.అంజన్న ఆశీర్వాద యాత్రను పురస్కరించుకుని కరీంనగర్ నుండి కొండగట్టు వరకు అడగడుగునా బండి సంజయ్ కు మంగళహారతులు,పూల జల్లులు,వీర తిలకంతో స్వాగతం పలికేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు, మహిళలు,కాషాయ సైనికులు సిద్ధమయ్యారు.ఈ నేపథ్యంలో కరీంనగర్ నుండి కొండగట్టు వరకు పెద్ద ఎత్తున అలంకరణ చేసే పనిలో కాషాయ శ్రేణులు నిమగ్నమయ్యాయి. ప్రధానంగా 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు జరుగుతున్నందున పాదయాత్ర సందర్భంలో రోడ్డుపై ట్రాఫిక్ జాం కాకుండా క్రమశిక్షణతో నడుస్తూ అంజన్న ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కాషాయ శ్రేణులను కోరారు.ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఆధ్యాత్మిక భావన పెంపొందించేలా ఈ యాత్ర కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ హాజరై "అంజన్న ఆశీర్వాద యాత్ర"ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.






## రాష్ట్ర మహిళ కాంగ్రెస్ కాంగ్రెస్ అధ్యక్షురాలిని సత్కరించిన జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సోమ లక్ష్మి

వరంగల్ ( వాయిస్ టుడే ) మార్చి 13 : తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గా నూతనంగా నియమించబడిన ఎర్రబెల్లి స్వర్ణ ను శుక్రవారం వరంగల్ జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సోమ లక్ష్మి మర్యాద పూర్వకంగా కలువడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ను శాలువ తో సన్మానించి ,పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా సోమ లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్ష పదవి విషయంలో కష్ట పడే వ్యక్తి కి అప్పగించడం,ఇప్పుడు రాష్ట్ర మహిళా అధ్యక్షులు గా మాజీ మేయర్, మాజీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఐన ఎర్రబెల్లి స్వర్ణ కు ఇవ్వడం పట్ల వరంగల్ ఉమ్మడి జిల్లా క్యాడర్ అంతా హర్షం వ్యక్త పరుస్తున్నారని ఆమె అన్నారు. పని చేసే కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళల్లో గుర్తిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సోమ లక్ష్మి తో పాటు వరంగల్ జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్, గిరి పుష్ప రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎర్రబెల్లి స్వర్ణ వారివురికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.



## సీఎం కప్ విజేతలకు సన్మానం

వరంగల్ ( వాయిస్ టుడే ) మార్చి 13 : హైదరాబాదులో ఇటీవల జరిగిన సీఎం కప్ పోటీలలో నగరం లోని కరీమాబాద్ అండర్ రైల్వే గేట్ ప్రాంతానికి చెందిన కివి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు వివిధ పథకాలు సాధించి నగదు పారితోషకాన్ని కూడా గెలుచుకున్నారు.బహుమతు లు పొందిన వారిలో కిక్ బాక్సింగ్‌లో సల్ల.సాత్విక్ ద్వితీయ బహుమతి సిల్వర్ మెడల్ 15000 రూపాయల పారితోషికం. యోగా పోటీలలో తుమ్మ.పవన్ కుమార్ ద్వితీయ బహుమతి,సిల్వర్ మెడల్. 15 వేల పారితోషికం జూడో పోటీలలో పల్లకొండ.సచిన్ బ్రాంజ్ మెడల్,10000 పారితోషికం గెలుపొందారు. ఈ సందర్బంగా పాటశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్ మూర్తి మాట్లాడుతూ మూడు పోటీల విభాగాలలో మెడల్స్ అలాగే పారితోషికం గెలుచుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్,యోగా శిక్షకులు జి.రవితేజ,కిక్ బాక్సింగ్ కోచ్ బి.సంతోష్,జూడో కోచ్ యన్ కుమారస్వామి ఇతర అధ్యాపక బృందం ,విద్యార్థిని విద్యార్థులు,పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన అరూరి



హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన మట్టపల్లి రాఘవరావు,దేవేందర్ రావు,అశోక్ రావు, వాసుదేవరావుల తల్లి ఉపేంద్ర దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం నారాయణపురం గ్రామానికి చెందిన కందికట్ల శ్రీను మరియు అదే గ్రామానికి చెందిన కొత్తూరు వెంకటయ్య ఇటీవల మరణించగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను అరూరి రమేష్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## మయూఖ కలెక్షన్స్ షాపును ప్రారంభించిన డాక్టర్ పెండ్యాల రోజు లక్ష్మి




పాల్వంచ మార్చ 13 (వాయిస్ టుడే) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ దమ్మపేట సెంటర్ పత్తిపాటి కాంప్లెక్స్ లో మయూఖ కలెక్షన్స్ మరియు వన్ గ్రామ్ గోల్డ్ జూలరి షాప్ ను తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం మహాసభ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు డాక్టర్ పెండ్యాల రోజా లక్ష్మీ ప్రారంభించారు, అనంతరం ప్రోపరేటర్ లక్ష్మి పెండ్యాల రోజా లక్ష్మి ని శాలువాతో సత్కరించి పుష్పగుచాన్ని అందజేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు, మయూక షాపులో కలెక్షన్స్ అన్ని చాలా బాగున్నాయి రేట్లు కూడా చాలా రీజనబుల్ గా ఉన్నాయి అని మాట్లాడారు ఈ కార్యక్రమంలో వంకదారు ఇందిరా, ధారా పద్మ , వారణాసి ధనలక్ష్మి, కొప్పరపు సౌజన్య, తాటిపల్లి దీప్తి, వనితా క్లబ్ అధ్యక్షురాలు సంక రమాకుమారి, సెక్రటరీ దారా మాధవి, సరిత, మాధవి, జ్యోతి , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చిరకాల కలను నెరవేర్చిన ఎమ్మెల్యే కే.ఆర్

## టేకులగూడెం ఎస్సీ కాలనీ తాగునీటి మస్యకు పరిష్కారం...

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు,మహిళలు

## ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కళ నెరవేరుతుంది: ఎమ్మెల్యే కే.ఆర్



కాజీపేట,వాయిస్ టుడే: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 64వ డివిజన్ టేకులగూడెం ఎస్సీ కాలనీ ప్రజల చిరకాల సమస్య అయినటువంటి తాగునీటి సమస్యను స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ ఎట్టకేలకు పరిష్కరించారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మరియు అప్పటి ఎమ్మెల్యేలకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదని కాలనీ వాసులు తెలిపారు. దాదాపు 10 నుండి 15 సంవత్సరాలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గత నెల రోజుల క్రితం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి కేవలం రెండు నెలల వ్యవధిలోనే రూ.25 లక్షల నిధులతో కొత్త పైప్‌లైన్ వేయించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

శుక్రవారం టేకులగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక కార్పొరేటర్ ఆవాల రాధిక రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ కాలనీ ప్రజలు పదేళ్లుగా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే స్పందించి పరిష్కరించడం నా బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. టేకులగూడెం ఎస్సీ కాలనీకి రూ.25 లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను తీర్చామని,ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక సదుపాయం కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తాననీ ఎమ్మెల్యే నాగరాజు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామాలలో ఇటీవల మరణించిన పలు కుటుంబాలను ఎమ్మెల్యే నాగరాజు స్వయంగా వారి నివాసాలకు వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కళ నెరవేరుతుంది

45వ డివిజన్ పరిధి లోని తరాలపల్లి గ్రామానికి చెందిన సింగారపు అరుణ-వెంకటేష్ దంపతులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. శుక్రవారం ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యతిథిగా పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు మాట్లాడుతూ "ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్నారు. గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని చెప్పి పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎం.డి బషీర్,డివిజన్ నాయకులు నర్మెట్ట వెంకటరమణ గౌడ్,కర్ర హరీష్ రెడ్డి,సదానందం,శ్రీనివాస్ రెడ్డి,నీలం రజినీ,గుర్రం జ్యోతి,బస్కే ప్రణయ్,కృష్ణ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## వేములపల్లి గ్రామములో నూతన 'శైలజ భోజనం హోటల్'ను ఘనంగా ప్రారంభించిన బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ

వేములపల్లి మార్చి 13 (వాయిస్ టుడే ) : వేములపల్లి గ్రామములో ఏర్పాటు చేసిన నూతనంగా ఏర్పాటుచేసిన శైలజ భోజనం హోటల్‌ను బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లమోతు సిద్ధార్థ మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు మరియు ప్రయాణికులకు నాణ్యమైన, రుచికరమైన మరియు శుచికరమైన ఇంటి భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ హోటల్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. స్వయం ఉపాధి దిశగా యువత అడుగులు వేయడం సంతోషకరమని, హోటల్ నిర్వాహకులకు తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిద్ధార్థ జ్యోతి ప్రజ్వలన చేసి హోటల్ కార్యకలాపాలను ప్రారంభించారు. హోటల్‌లో అందించే ఆహార పదార్థాల నాణ్యతను, కిచెన్ పరిసరాలను ఆయన పరిశీలించారు. హోటల్ నిర్వాహకులు మాట్లాడుతూ.. తమ హోటల్‌లో అతి తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందిస్తామని, కస్టమర్ల సంతృప్తియే తమ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన నల్లమోతు సిద్ధార్థ కి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిర్ర మల్లయ్య యాదవ్, పుట్టల సందీప్, అమరారపు తిరుమలేష్ ద్రైద జాన్సన్,జడ మట్టయ్య, నాగవెల్లి శంకర్, పుట్టల పాల్,పుట్టల రవి, గుండెబోయిన మల్లయ్య,మాతంగి సుదీర్,రాచూరి శివ,ఉగ్గే మునిస్వర్,మాతంగి విజయ్ కుమార్,దామోదర్ రెడ్డి,మాలి శంకర్ రెడ్డి,పగిల్ల శ్రీను, చందు, స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు, హోటల్ యజమాన్యం పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా పౌరసరఫరా శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

### 16 హోటళ్లలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 13: నిర్మల్ పట్టణం లోని పలు హోటళ్లలో, రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ దేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. 16 హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, గృహావసరాల కొరకు ఉపయోగించటానికి కేటాయించిన 29 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో చట్టానికి విరుద్ధంగా గృహ అవసరాల కొరకు కేటాయించిన సిలిండర్లను వ్యాపార అవసరాల కొరకు ఉపయోగించరాదని అధికారులు తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాల కొరకు ఉపయోగిస్తే, చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

# స్నేహం,ఐక్యత,సోదర భావానికి ప్రతీక రంజాన్ పండుగ

## హిందూ,ముస్లింలు గంగా జమునా తహజీబ్ లా పండుగలు జరుపుకోవాలి

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

## ముస్లింలకి ప్రత్యేక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే నాయిని

## పాల్గొన్న ఎమ్మెల్సీ,కుడా చైర్మన్, హాజ్ కమిటీ చైర్మన్, మేయర్, కార్పొరేటర్లు



హనుమకొండ,వాయిస్ టుడే: స్నేహం,ఐక్యత,సోదర భావానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ పండుగను హిందూ,ముస్లింలు గంగా--జమునా తహజీబ్ స్ఫూర్తితో కలిసి జరుపుకోవాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరుల కోసం శుక్రవారం హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రత్యేక ఇఫ్తార్ విందును నిర్వహించారు. ప్రతియేటా పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు ప్రత్యేక ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లిం మత పెద్దలు,యువకులు,ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థనలు నిర్వహించారు. సుమారు 2000 మందికి పైగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఉపవాసం,త్యాగం,సేవా భావం,పరస్పర సహకారానికి ప్రతీక అని తెలిపారు. సమాజంలో శాంతి,సౌభ్రాతృత్వం నెలకొల్పడంలో ఈ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. వరంగల్ నగరం ఎప్పటి నుంచో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని,అన్ని మతాల ప్రజలు కలిసి పండుగలు జరుపుకోవడం ఈ నగర ప్రత్యేకత అని పేర్కొన్నారు. ముస్లిం సోదరుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మైనార్టీల విద్యా అభివృద్ధి,ఉపాధి అవకాశాల పెంపు,స్వయం ఉపాధి పథకాల అమలు,మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు,మసీదులు మరియు మత సంబంధిత స్థలాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముస్లిం యువతకు విద్యా రంగంలో ప్రోత్సాహం అందించేందుకు మరియు వారి సామాజిక--ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. రంజాన్ పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని పేద ముస్లిం కుటుంబాలకు సహాయంగా సుమారు 1700 మందికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రంజాన్ బహుమతులు అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని 7 ప్రధాన మస్జిద్‌లలో ఇఫ్తార్ విందుల నిర్వహణకు గాను 7 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇదే కాకుండా సుమారు 100 మంది ముస్లిం మత పెద్దలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వయంగా కొత్త బట్టలు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముస్లిం సోదరుల పట్ల తనకు ఉన్న అభిమానం,గౌరవానికి ఇది నిదర్శనమని తెలిపారు. ముస్లిం సోదరుల సమస్యలను పరిష్కరించడం..వారి అభివృద్ధికి సహకరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. రానున్న రోజుల్లో కూడా మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ ఇఫ్తార్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య,రాష్ట్ర హాజ్ కమిటీ చైర్మన్,ఖాజీపేట దర్గా పీఠాధిపతి కుసురు పాషా,కుడా చైర్మన్ హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,నగర మేయర్ గుండు సుధారాణి,పీసీసి ప్రధాన కార్యదర్శి ఇ.వి శ్రీనివాస్,బట్టి శ్రీనివాస్,కార్పొరేటర్లు విజయ శ్రీ రజాలీ, వేముల శ్రీనివాస్,మామిండ్ల రాజు,మానస రాంప్రసాద్,నాయకులు అబూబక్కర్, అంబేద్కర్ రాజు, బంక సంపత్, ప్రణీత్,తదితరులు హాజరయ్యారు.




## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- రాష్ట్ర అభివృద్ధిలో డీలర్స్ పాత్ర కీలకం

- ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సన్మాన సభలో నాగుర్ల వెంకటేశ్వర్లు.

వరంగల్(వాయిస్ టుడే) 13 మార్చి : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తేనే డీలర్స్ ను ఎక్కువగా నమ్ముతారని, రాష్ట్రా అభివృద్ధిలో డీలర్స్ పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్,పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్,డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ శివనగర్ లో గల ది వరంగల్ ఫర్టిలైజర్స్,ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్,డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు సభా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల ఎన్నికైన నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయాన్ని కొనసాగించాల్సినటువంటి బాధ్యత డీలర్ల అందరి పైన ఉందని, దీన్ని తప్పకుండా పాటించాల్సినటువంటి అవసరం ఉందన్నారు. కార్యవర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ నిర్ణయాన్ని కట్టుబడి, ఆ నిర్ణయం పట్ల మనమందరం కూడా తన వంతు పాత్రను పోషించాలన్నారు. జై జవాన్ జై కిసాన్...నిజంగా మనం కూడా రైతు రాజు కావడానికి మన వంతు పాత్ర ఉందన్నారు.ఫస్ట్ మనం పాటించాల్సింది క్వాలిటీ అని, రైతుకు మనం వెన్ను దండగా ఉండాల్సినటువంటి బాధ్యత మన పైన ఉందని రైతులకు అందుబాటులో ఉండి నాణ్యమైన విత్తనాలు, నాణ్యమైన పురుగు మందులు అందించాలన్నారు.

క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావద్దని,నాణ్యమైనటువంటి కంపెనీ విత్తనాలను మాత్రమే రైతులకు అందించాలని మీ అందరికీ కోరుకుంటున్నానని అన్నారు. విత్తనాన్ని చెక్ చేసిన తర్వాతనే మనం రైతు కు అమ్మాలి తప్ప, మన ఏ విత్తనాన్ని గాని, ఏ పురుగుమందు గానీ ఏదైనా కూడా ట్రయాల్ చూడకుండా ప్రమోట్ చేయవద్దని విషయాన్ని తెలిపారు.రైతుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందన్న విషయాన్ని కూడా ఈ సభా సందర్భంగా గుర్తు చేశారు. మండల స్థాయి, జిల్లా స్థాయి జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయి వరకు కూడా కమిటీలను పటిష్టం చేయాల్సినటువంటి పరిస్థితి ఉందని,అవన్నీ కూడా జిల్లాల వారిగా ఇంకా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని,వరంగల్ జిల్లాలో మాదిరిగా మన ఆత్మగౌరవ భవనాన్ని రాష్ట్ర స్థాయిలో కూడా తప్పకుండా భవన నిర్మాణం మీ అందరి సహకారంతోటి పూర్తి చేస్తానని అన్నారు.. ఎవరైనా వచ్చినా కూడా ఒక రెస్ట్ తీసుకోవడానికి కొన్ని రూమ్స్ ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించుకున్నామని, తప్పకుండా మీ అందరి యొక్క సహకారం తో బిల్డింగ్ నిర్మాణాన్ని చేసి తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామడుగు మనోహర్ మాట్లాడుతూ డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్ కు ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉండాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు కూడా పని చేయకూడదని అన్నారు. రాష్ట్ర కోశాధికారి సిద్ధి నాగరాజు మాట్లాడుతూ భవన నిర్మాణానికి కావలసినటువంటి నిధులను సేకరించి భవన నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొద్ది రెడ్డి నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ రెడ్డి , కేదారి, పాండురంగయ్య, వివిధ జిల్లాల నాయకులు శ్రీనివాస్ లాహోటి,మాడిశెట్టి అశోక్, శేఖర్,రతన్,రాజేందర్ రెడ్డి, రమేష్,రవి,శ్రీను,అమూల్య ప్రవీణ్,సదానందం,మురళి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పలుగుమీద నల్ల పోచమ్మ తల్లి జాతర ఉత్సవాలు అగ్గి గుండాలు బండ్లు బోనాలు ఊరేగింపు

నర్సాపూర్ (వాయిస్ టుడే): హత్నూర మండల పరిధిలోని షేర్ఖాన్పల్లి పలుగు మీద నల్ల పోచమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వణాధికారి దేవానందం మాట్లాడుతూ అమ్మవారి కళ్యాణంఅగ్గి గుండాలు బండ్లు బోనాలు ఊరేగింపు ఘనంగా నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు ఈ జాతర ఉత్సవాలకు షేర్ ఖాన్ పల్లి గ్రామస్తులుచుట్టుపక్కల గ్రామాల నుండి గ్రామ ప్రజలు భారీ ఎత్తున వచ్చి విజయవంతం చేశారని ఆయన తెలిపారు అమ్మవారి కృప ప్రజలపై ఉండాలని ఆయన అమ్మవారిని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు భక్తులు వేద పండితులు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలి

### -8, 9 వార్డు కౌన్సిలర్లు కోల ఉదయభాను, బొల్లెద్దు ధనమ్మ



హుజుర్ నగర్, మార్చి 13 (వాయిస్ టుడే ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని హుజూర్ నగర్ పట్టణంలోని 8, 9వ వార్డు కౌన్సిలర్లు కోలా ఉదయభాను, బొల్లెద్దు ధనమ్మ కోరారు. శుక్రవారం పట్టణంలోని గోవిందపురంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను పునర్నిర్మాణం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహాయ సహకారాలతో ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులుగా మారి స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. అనంతరం నూతనంగా కౌన్సిల్ గా ఎన్నికైన కౌన్సిలర్లు ఉదయభాను, ధనమ్మ లను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సైదా నాయక్, హెచ్ఎం గొట్టే శ్రీనివాస్ యాదవ్, చిలక బత్తిని సౌజన్య, గొట్టెముక్కల రాములు, ఉపాధ్యాయులు బొల్లం వెంకటేశ్వర్లు, సైదులు, వీరస్వామి, చంద్రశేఖర్, జయరాజు, నాగలక్ష్మి పోటు ఉపేందర్ పాల్గొన్నారు.

## హత్నూర మండలానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు కృషితో 40 లక్షల రూపాయలు నిధులు మంజూరు

### హర్షం వ్యక్తం చేసిన బిజెపి జిల్లా నాయకులు బిట్ల మహేష్



వాయిస్ టుడే నర్సాపూర్: హత్నూర మండలానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు చొరవతోదౌల్తాబాద్ బోరుపట్ల రెడ్డి ఖానాపూర్ చందాపూర్ తదితర గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం 40 లక్షల రూపాయలు ఎంజీఎంఆర్ఐ ఈజీఎస్ ద్వారాఎంపీ రఘునందన్ రావు విడుదల చేయడం జరిగిందని సంగారెడ్డి జిల్లా బిజెపి నాయకులు బిట్ల మహేష్ అన్నారు ఈ సందర్భంగా బిట్ల మహేష్ మాట్లాడుతూ ఎంపీ రఘునందన్ రావు గారు సిసి రోడ్ల నిర్మాణం గురించి నిధులు మంజూరు చేసినందుకు ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు

## అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



చేవెళ్ల... మార్చి 13(వాయిస్ టుడే) అప్పుల బాధతో మనస్థాపానికి గురై, రైతు పురుగుల మందు తాగి ఆత్మ హత్యకి పాల్పడిన ఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శంకర్ పల్లి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన పాల యాదయ్య (45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకి భార్య కొడుకు, కూతురు ఉన్నారు. ఏడాది క్రితం కూతురు వివాహమైంది. గత కొన్ని రోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఇంట్లో గొడవలు జరిగాయి . దీంతో మనస్థాపానికి గురైన యాదయ్య గురువారం శంకర్ పల్లి లో పురుగుల మందు కొనుగోలు చేసి రాత్రి ఇంటికి వెళ్ళకుండా, పొలానికి వెళ్ళాడు. శుక్రవారం ఉదయం పొలం వద్ద పురుగుల మందు తాగిన తర్వాత కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఇంటికి వెళ్ళాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముదస్సర్ ఆలీ తెలిపారు.



## నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలకు అనుమతులు ఇస్తున్న ఎంఈఓ అక్బర్‌పై తగిన చర్యలు తీసుకోవాలి

చేవెళ్ల... మార్చి 13(వాయిస్ టుడే): శంకర్ పల్లి మండలంలోని నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలకు అనుమతులు ఇస్తున్న ఎంఈఓ అక్బర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పి డి ఎస్ యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ అధికారి నవీన్ నికోలాస్ కు వినతి పత్రం అందజేశారు. 2009 విద్య హక్కుల చట్టానికి వ్యతిరేకంగా పాఠశాలలో ఏకరూప డ్రెస్‌లు, నోట్ బుక్స్ అమ్మకం చేసినప్పటికీ ఆయన చర్యలు తీసుకోలేదని, ఫిర్యాదులో జతపరిచారు. 2015 నుంచి ఎంఈఓ మండలంలో చేసిన అక్రమాలపై విచారణ జరిపించాలని,ఓ పాఠశాలకు పదవ తరగతి అనుమతులు లేకుండా అడ్మిషన్లు, పరీక్షలు నిర్వహించేందుకు సహకరిస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## బాకంసాయి కిరణ్ ఔదార్యం!

### విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు పెన్సిళ్లు అందజేత

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మార్చి-13 వాయిస్ టుడే : ఆరవ వార్డు లోని పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఆరవ వార్డు కౌన్సిలర్ బాకమ్ సాయికిరణ్ శుక్రవారం దాదాపు ముప్పై మందికి పరీక్ష ప్యాడులు పెన్నులు పెన్సిళ్లు అందజేసి, తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ సాయికిరణ్ మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థిని విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ప్రతి ఒక్కరు మొదటి ర్యాంకులో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. విద్యార్థిని విద్యార్థులకు తన సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని సాయికిరణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ కుమార్ ఆరెపల్లి కిరణ్ హేమన్ రాజు సోహన్ రాజు మామిడిపల్లి శ్రీకాంత్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

### దౌల్తాబాద్ ఉప సర్పంచ్ శేఖర్ గౌడ్. వైస్ టుడే నర్సాపూర్



నేటి నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి ప్రతిభ కనబరిచి విజయాన్ని సాధించాలని ప్రియమైన విద్యార్థిని విద్యార్థులారా మీ యొక్క బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి పరీక్షలు టోలినట్టు లాంటివని దౌల్తాబాద్ ఉప సర్పంచ్ శేఖర్ గౌడ్ అన్నారు భయం వీడండి టెన్షన్ పడవలసిన అవసరం లేదు ఆత్మవిశ్వాసంతో దుడ సంకల్పంతో ఎలాంటి సంకోచం లేకుండా పరీక్షలకు హాజరై నిర్భయంగా అద్భుతమైన ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు కష్టాలను ఉపాధ్యాయుల శ్రవణం మీ భవిష్యత్తును గుర్తు చేసుకొని ఎలాగైతే పరీక్షలకు సన్నద్ధమయ్యారు అదేవిధంగా పరీక్షలు ఎలాంటి ఒడిదుడుకులు లోను లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని మీ శ్రేయోభిలాషిగా దౌల్తాబాద్ ఉప సర్పంచ్ శేఖర్ గౌడ్



## ఉచిత కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మార్చి-13 వాయిస్ టుడే : సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జూపల్లి తిరుమల్ రావు ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలోని అల్లిపూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ కోదాటి సాయికిరణ్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ సాయి కిరణ్ కోరిక మేరకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుమల్ రావు రేకుర్తి కంటి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా రెండు వందల యాభై మందికి పైగా వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకున్నారు.ముప్పై ఆరు మందిని రేకుర్తి ఆస్పత్రికి ఉచిత శాస్త్ర చికిత్స నిమిత్తం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. లైన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుమల్ రావు మాట్లాడుతూ కంటి సమస్యలతో ఏ ఒక్క నిరుపేద వ్యక్తి బాధపడకూడదని సదుద్దేశంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ సాయికిరణ్ మాట్లాడుతూ తమ గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుమలరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం తో పాటు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



## యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మార్చి-13 వాయిస్ టుడే : పెద్దపల్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డులో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పది లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏడవ వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్ ఆధ్వర్యంలో యాదవ సంఘం కుల పెద్దలతో పాటు సంబంధిత ఏఈ తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన బిల్డింగ్ అంచనాలు, నిర్మాణ విధానం, స్థల పరిశీలన తదితర అంశాలపై సవివరంగా చర్చించారు. త్వరలోనే పనులు ప్రారంభించి యాదవ కమ్యూనిటీకి ఉపయోగపడే విధంగా హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే సహకారంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం ఆనందకరమని తెలిపారు. ఈ హాల్ ద్వారా యాదవ సంఘానికి చెందిన ప్రజలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం కుల పెద్దలు, స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు..



## 19వ వార్డులో విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు

హుజూర్ నగర్, మార్చి13 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ పట్టణంలోని 19 వ వార్డులో విద్యుత్ సౌకర్యాలు శుక్రవారం ఏర్పాటు చేసినట్లు ఆ వార్డ్ కౌన్సిలర్ వల్ల దాస్ కృష్ణ అన్నారు. వార్డులో కొత్తగా ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు, కరెంట్ లైన్లను మున్సిపల్ చైర్మన్ దొంత గాని శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కోతిసంపత్ రెడ్డి సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో 19వ వార్డు ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీ పులిచింతల వెంకట రెడ్డి బెల్లంకొండ అమర్ , సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్ , దగ్గుపాటి కవిత బాబురావు, స్థానిక ప్రముఖులు రవికుమార్ శకమూరి, పొంగులేటి సత్యమయ్య, సయ్యద్ రఫీ, జిల్లా మాజీ వర్క్ బోర్డ్ డైరెక్టర్ సైదా మేస్త్రీ ,టిడిపి అలీ బాబా నాగుల్ మీరా మాజీ రసూల్ రఫీ ఖాజా మోహన్ రెడ్డి వల్లబ్దాసు బాలకోటయ్య బంటు సైదులు ఉదారి శ్రీను మామిడి సతీష్ సైదులు కౌన్సిలర్ వల్లపు దాసు ఎల్లమ్మ వెంకటేశ్వర్లు పన్నాల నాగేశ్వరరావు మామిడి సతీష్ మణికంఠ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సహాయం



హుజూర్ నగర్, మార్చి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): పట్టణంలోని 25వ వార్డుకు చెందిన మహిళకు హుజూర్ నగర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం పట్టణంలోని సీతారాం నగర్ 25వ వార్డుకు చెందిన బుడిగ సావిత్రమ్మ గత 20 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక 25 వ వార్డు కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. వార్డులో ఏ సమస్య వచ్చినా పేదలకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్, 25వ వార్డు బూత్ కమిటీ సభ్యులు యాల్లావుల వీరయ్య, ఓర్స్ వెంకన్న, తోట ఉపేందర్, పిల్లి.శివ శంకర్, ములకలపల్లి శ్రీను, శీలం సైదులు, కొత్తపల్లి శ్రీను, గుంజ గౌతమ్, గణపవరపు సైదులు, వెన్నం.నరసింహారావు, మాదాసు శశి తదితరులు పాల్గొన్నారు.

## రానున్న బడ్జెట్లో బీసీలకు న్యాయం చేయాలి

### బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు



హుజూర్ నగర్, మార్చి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): త్వరలో తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు 50 వేల కోట్లు కేటాయించి బీసీలకు న్యాయం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హుజూర్ నగర్ పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎనిమిది దశాబ్దాల కాలంగా బీసీలను ఓట్లు వేసే యంత్రాలు గానే భావించడం తగదని, బీసీలు చైతన్యమైన ఫలితంగా ప్రభుత్వం బిసిలకు స్థానిక సంస్థల్లో 17% మాత్రమే రిజర్వేషన్లు కల్పించినప్పటికీ 61శాతం మున్సిపాలిటీలో విజయం సాధించిన విషయాన్ని బీసీల విజయంగా భావిస్తున్నామన్న విషయాన్ని పాలకులు గుర్తించాలని, గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో హామీ ఇచ్చిన మేరకు ప్రతి బడ్జెట్లో 20000 కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా ఇంతవరకు కేటాయించలేకపోయారని, అయినప్పటికీ కనీసం ఈ బడ్జెట్ లోనయినా 50 వేల కోట్ల రూపాయలు కేటాయించి బీసీలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో బీసీలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపన బోయిన వెంకటేశ్వర్లు, పరికె భరత్, జక్కుల రమణ, ఆర్ శ్రీను ఉన్నారు.



## కవిత జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో పండ్లు, బ్రెడ్ పంపిణీ

హుజూర్ నగర్, మార్చి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా జిల్లా నాయకులు ఎస్ కె మస్తాన్ అధ్వర్యంలో హుజూర్ నగర్ పట్టణంలో గల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో రోగులకు శుక్రవారం పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసారు. అనంతరం జాగృతి నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియ చేశారు. ఈ సందర్భంగా జాగృతి రాష్ట్ర నాయకులు కెఎల్ఎన్ రావు , ఎస్ కె మస్తాన్ లు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు కవిత విశేషమైన కృషీ చేశారన్నారు. పార్లమెంట్ లో మహిళా బిల్లు చట్టంగా రూపొందడానికి, బిసి లకు విద్యా, ఉద్యోగాలు స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ సాధనకు పోరాటం చేసారన్నారు.

ఇటీవల ఖమ్మంలో వెలుగుమట్ల గ్రామంలో ఇండ్ల కూల్చివేత బాధితుల పక్షాన నిలబడి నిరాహార దీక్ష చేసిన ఫలితంగా ప్రభుత్వం దిగి వచ్చి బాధితులకు న్యాయం చేయడం కవిత పోరాట ఫలితం అన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు ప్రజల సమస్యల పట్ల పోరాటం చేయడంలో విఫల మైతే, కవిత ప్రశ్నించే గొంతుక అయి బాధితుల పక్షాన నిరంతరం నిల బడుతున్నరన్నారు. ఈ కార్యక్రమంలో కె. సత్యనారాయణ రెడ్డి, సౌదశోతు బిక్షం, మామిడి పన్నీరు, నర్సింహ రావు, పి. నర్సింహ రావు, వేణు, బానోతు నర్సింహ , వెంకట కృష్ణ, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**